

మార్కెట్ కమిటీలకు సారథులు!



జయ వెంకటలక్ష్మి



భాగ్యశ్రీ



రిష్వంత్

అమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జయవెంకటలక్ష్మి

ముమ్మిడివరం.. ఓగూరి భాగ్యశ్రీ

రామచంద్రపురం.. రిష్వంత్‌రాయ్

ఒకటి జనసేన.. రెండు టీడీపీ

అమలాపురం/రామచంద్రపురం, జూలై17(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా నుంచి మూడు మార్కెట్ కమిటీలకు చైర్మన్లను నియమిస్తూ ఉత్తర్వులు విడుదల అయ్యాయి. అమలాపురం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా టీడీపీకి చెందిన అధికారి జయవెంకటలక్ష్మిని నియమించారు. గురువారం రాత్రి ఈ మేరకు నియామక ఉత్తర్వులను విడుదల చేశారు. గతంలో టీడీపీ తరఫున జడ్పీటీసీగా ఈమె పనిచేశారు. గత కొంతకాలంగా అమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై ఎన్నో ఊహాగానాలు ఉన్నప్పటికీ ఆది నుంచి అధిష్టానం ఆమె పేరునే పరిగణనలోనికి తీసుకుని ప్రకటించడం విశేషం. ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్‌గా జనసేన పార్టీకి చెందిన ఓగూరి భాగ్యశ్రీ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి నియమాక ఉత్తర్వులు అందాయి. కాట్రేనికోన మండలం ఓగూరి భాగ్యశ్రీ గత ఎంపీటీసీ ఎన్నికల్లో జనసేన తరఫున పోటీచేసి అతి స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. ఈమె దివంగత మాజీ మంత్రి మోకా విష్ణుప్రసాదరావు కుమార్తె. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ మోకా ఆనంద్‌సాగర్ సోదరి. జనసేన కాట్రేనికోన మండల అధ్యక్షుడు మోకా బాలప్రసాద్ మేనత్త. ఇక్కడ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ తెలుగుదేశం పార్టీకి కేటాయిస్తారని ప్రచారం జరిగినా చివరిలో పార్టీ, సామాజికవర్గాల సమీకరణలో జనసేనకు ఇచ్చారు. ఇక రామచంద్రపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా యువనేత అక్కల రిష్వంత్‌రాయ్‌ను ఖరారు చేశారు. అక్కల రిష్వంత్ రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. రిష్వంత్‌రాయ్ విద్యార్థి దశ నుంచి తెలుగు విద్యార్థి సంఘం, తదుపరి తెలుగుయువత నాయకుడిగా పనిచేస్తున్నారు. వైసీపీ హయాంలో రామచంద్రపురంలో టీడీపీ కష్టకాలంలో రిష్వంత్‌రాయ్ చురుగ్గా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అప్పటి నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యంతో కలసి పార్టీ పునరుజ్జీవానికి కృషిచేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుయువత విభాగం పటిష్టానికి పనిచేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో రిష్వంత్ పార్టీ గెలుపునకు తీవ్రంగా కృషి చేశారు. దీంతో పార్టీ కోసం కష్టించి పనిచేసిన రిష్వంత్‌రాయ్‌ను ఈ పదవికి ఎంపిక చేసింది.





జేసీ నివాస గృహానికి వెళ్లే మార్గం చెంతన బ్లూ రేకుల ఫెన్సింగ్‌తో మూసివేసిన దృశ్యం.. రంగాపురంలోని ఇరిగేషన్ ఈఈ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిబ్బంది

ఇరిగేషన్ ఈఈ కార్యాలయానికి అడ్డంగా రేకులతో ఫెన్సింగ్

- నిరసన వ్యక్తంచేసిన ఈఈ కార్యాలయ సిబ్బంది
- జేసీ నివాస గృహానికి అడ్డంకిగా వాహనాలు ఉంచడం వల్లే ఈ పరిణామాలు

అమలాపురం, జూలై17(ఆంధ్రజ్యోతి): జలవనరులశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయానికి దారిలేకుండా రేకులతో అడ్డకులు సృష్టించారంటూ ఆ కార్యాలయ సిబ్బంది గురువారం నిరసన వ్యక్తంచేశారు. ఇరిగేషన్ కార్యాలయం చెంతనే జిల్లా జాయింట్ కలెక్టర్ నివాస భవన సముదాయం ఉంది. అయితే జేసీ వాహనానికి అడ్డంగా రోడ్డుకి ఇరువైపులా ఎక్కడికక్కడే వాహనాలు నిలిపివేయడంతో జేసీ వాహనం రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారుల సూచనలతో ఇరిగేషన్ ఈఈ కార్యాలయానికి వెళ్లే దారిని కొంత మేర క్లోజ్ చేయడంతో సిబ్బంది లోనికి వెళ్లేందుకు కొంత ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దాంతో వారు నిరసన వ్యక్తం చేశారు. కొత్త జిల్లా ఆవిర్భావ సమయంలో జాయింట్ కలెక్టర్ నివాస సముదాయం కోసం ఈఈ ఆఫీసు చెంతనే ఉన్న భవనాలను జేసీకి అప్పట్లో కేటాయించారు. అక్కడ కొన్ని సౌకర్యాలు లేమితో ఉన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇటీవలే నేరుగా జేసీ నివాసానికి వెళ్లేందుకు సీసీ రోడ్డు కూడా నిర్మించారు. అయితే ఈఈ కార్యాలయానికి వచ్చే కార్యాలయ సిబ్బందితోపాటు కాంట్రాక్టర్లు, రైతులు, ఇతరులు సిమెంటు రోడ్డుపై అడ్డంగా వాహనాలు నిలిపివేసి కార్యాలయంలోకి వెళుతుండడంతో జేసీ ప్రయాణించే వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్య కలుగుతోంది. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ కార్యాలయం వైపు ఉన్న సీసీ రోడ్డు చెంతనే జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో అధికారులు అక్కడ సిమెంటు రేకులతో ప్రహరీ మాదిరిగా గత రెండు రోజుల నుంచి నిర్మాణం చేపట్టారు. గురువారంతో పనులు పూర్తికావడంతో సిబ్బంది సిమెంటు రోడ్డు నుంచి లోనికి వెళ్లేందుకు మార్గం ఇబ్బందికరంగా మారడం, ప్రత్యామ్నాయ రహదారి తుప్పలు, పాములతో సక్రమంగా లేకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామంటూ ఇరిగేసషన్ కార్యాలయ సిబ్బంది ఆందోళన వ్యక్తంచేశారు. తమ కార్యాలయానికి వెళ్లే రహదారిని మూసివేయడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్న దృష్ట్యా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని ఇరిగేషన్ ఉద్యోగులు కోరుతున్నారు. ప్రత్యామ్నాయ రహదారి పెద్దపెద్ద పాములు, తుప్పలతోఉండడం వల్ల తాము అటువైపు వెళ్లలేకపోతున్నామని వాపోతున్నారు.

ఆ వివాదంతో జేసీకి సంబంధం లేదు : డీఆర్వో

అమలాపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): అమలాపురం రూరల్ మండలం రంగాపురంలోని జాయింట్ కలెక్టర్ నివాస గృహానికి వెళ్లే ప్రాంతం వద్ద ఉన్న ఇరిగేషన్ కార్యాలయానికి రేకులతో దారి మూసేశారన్న విషయం జేసీకి తెలియదని డీఆర్వో బి.రాజకుమారి వివరణ ఇచ్చారు. ఇంటి ప్రాంగణంలో సీసీలకు ఒక రూమ్ కావాలని, దానిని కనస్ట్రక్షన్ చేయాలని పంచాయతీరాజ్ డీఈకి ఆదేశించారని, ఆ భవన నిర్మాణంలో భాగంగా ఇరిగేషన్ కార్యాలయ ప్రాంగణాన్ని కొందరు ఆక్రమించుకుంటున్నారనే ఉద్దేశంతో డీఈ ఫెన్సింగ్ ఏర్పాటుచేశారని డీఆర్వో తెలిపారు. ఈ వివాదాన్ని గతంలో ఇక్కడ పనిచేసిన డీఈ శ్రీనివాస్, ఆయన మద్దతుదారులు కారణమని డీఆర్వో ఆరోపించారు. అయినా జేసీ నిషాంతి స్పందించి తక్షణమే ఇరిగేషన్ కార్యాలయంలోకి కార్లు వెళ్లేలా ఫెన్సింగ్‌ను తొలగించాలని ఆదేశించినట్టు చెప్పారు.



నరేంద్రపురం గురుకుల పాఠశాలలో 5వ తరగతి విద్యార్థితో కథ చెప్పించుకుంటున్న మంత్రి డోలా. పక్కన ఎంపీ హరీష్‌మాధుర్

ఎస్సీ సంక్షేమానికి ఒకే ఏడాదిలో రూ.300 కోట్లు కేటాయింపు

ఆదర్శ గ్రామ యోజన కింద 1100 ఎస్సీ గ్రామాలు

రాష్ట్ర సాంఘిక శాఖా మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి

పి.గన్నవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఒకే ఏడాదిలో ఎస్సీ సంక్షేమానికి రూ.300 కోట్లు నిధులు కేటాయించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. వాటిని హాస్టళ్ల మరమ్మతులు, మరుగుదొడ్లు, నూతన భవనాలు తదితర పనులకు వినియోగించారని చెప్పారు. అలాగే ఎస్సీ, ఎస్టీ పెండింగ్ బకాయిలను కూడా చాలావరకు క్లియర్ చేశామన్నారు. రాష్ట్రంలో ఇంకా రూ.30 కోట్లు బకాయి ఉందని, వాటిని కూడా ఆగస్టు 15 నాటికి క్లియర్ చేస్తామని చెప్పారు. పి.గన్నవరం మండలంలోని నరేంద్రపురం గురుకుల పాఠశాలను బుధవారం మంత్రి సందర్శించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లలో వైసీపీ ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీలను పూర్తిగా తొలగిస్తే, కూటమి ప్రభుత్వం కాస్మోటిక్ కిట్స్ ద్వారా విద్యార్థులకు అందించే ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం టెండర్ల దశలో ఉందని, నాణ్యమైన వస్తువులు అందించే దిశగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. హాస్టల్లో విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వారికి కూడా ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. ఎస్సీసబ్‌ప్లాన్ నిధుల ద్వారా రాష్ట్రంలో ఎస్సీ కాలనీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆదర్శగ్రామ యోజన కింద సుమారుగా 1100 గ్రామాలను అభివృద్ధి చేయాల్సి ఉండగా, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 54 గ్రామాలు వచ్చాయని, వాటిని కూడా ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోబోతున్నామని చెప్పారు.

సన్మానానికి రాలేదు.. పరిశీలనకు వచ్చాను..

గురుకుల పాఠశాలకు విచ్చేసిన మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఎంపీ హరీష్‌మాధుర్‌లకు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. కారు దిగిన వెంటనే మంత్రి అధికారులను ఉద్దేశిస్తూ తాను సన్మాన కార్యక్రమానికి రాలేదని, పరిశీలనకు మాత్రమే వచ్చానని బదులిచ్చారు. కాగా పాఠశాల, మెస్, మరుగుదొడ్లు, విద్యార్థులు నిద్రించే గదులను పరిశీలించి ప్రశ్నల వర్షం కురిపించారు.



ఎత్తిపోస్తారు!

ప్రైవేటుకు ఎత్తిపోతల

- ఉమ్మడి జిల్లాలో 48 పథకాలు
- కార్పొరేట్‌కు నిర్వహణ బాధ్యత
- రూ.600 కోట్లతో ప్రతిపాదన
- వైసీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యం
- ఏజెన్సీలో 50 పథకాల మూత
- కూటమి ప్రభుత్వం దృష్టి
- కొత్త పద్ధతికి శ్రీకారం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

నిర్వీర్యమైన చిన్న నీటిపారుదల వ్యవస్థను బతికించడానికి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ఆరంభించింది. ఓ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థకు మరమ్మతులు, నిర్వహణ బాధ్యత అప్పగించనుంది. ఉభయగోదావరి జిల్లాల్లో మెట్ట ప్రాంతంలోని 48 ఎత్తిపోతల పథకాల మరమ్మతులు, నిర్వహణకు రూ.600 కోట్లతో అధికారులు అంచనాలు సిద్ధంచేశారు. గత వైసీపీ హయాంలో చిన్న నీటిపారుదల వ్యవస్థ పూర్తిగా అవస్థలకు గురైంది. ఇప్పటికే ఏజెన్సీలో 70 ఎత్తిపోతల పథకాలు మూతపడ్డాయి. దీంతో వాటిని వదిలేశారు. కాలువల ద్వారా నీటి సరఫరా లేని మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో సాగునీరు సరఫరా చేయడానికి 1974లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల సంస్థ ఏర్పడింది. కనీసం 50 నుంచి 5 వేల ఎకరాల వరకూ ఉన్న భూములకు ప్రభుత్వం ఒక్కొక్క ఎత్తిపోతల పథకం నిర్మించి రైతులకు అప్పగించేది. వాటికి ఉచిత కరెంట్ ఇచ్చేది. వాటి నిర్వహణ రైతులు చేసుకోవాలి. దీని కోసం 11 మంది సభ్యులతో కూడిన రైతు కమిటీ ఉండేది. రైతుల నుంచి ఎకరాకు రూ.500 నుంచి రూ.1000 వరకూ ఏడాదికి వసూలు చేసి ఎత్తిపోతల పథకాలు నిర్వహణ చూసేవారు. ఇలా చాలా కాలం నడిచిన పథకాలను వైసీపీ పూర్తిగా నిర్వీర్యం చేసింది. దీంతో చాలాచోట్ల రైతులు వదిలేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 101 ఎత్తిపోతల పథకాలు ఉండేవి. 37,450 ఎకరాల ఆయకట్టు ఉండేది. పోలవరం ప్రాజెక్టు ముంపు కారణంగా ఏజెన్సీ ప్రాంతాల్లో 50 ఎత్తిపోతల పథకాలను పనిచేయడంలేదు. మరో 20 పథకాలు నిర్వీర్యమయ్యాయి. ప్రస్తుతం ఉభయగోదావరి జిల్లాల పరిధిలో ఉన్న 48 ఎత్తిపోతల పథకాలను రైతుల నుంచి తప్పించి కార్పొరేట్ సంస్థకు ఇచ్చి వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 28 పథకాలు..

- తూర్పుగోదావరి జిల్లాలో 10 పథకాలు పాక్షికంగా పనిచేస్తున్నాయి. కొవ్వూరు నియోజకవర్గంలో కుమారదేవం, బ్రాహ్మణగూడెం, చాగల్లు, వేగేశ్వరపురం, పైడిమెట్ట-1, నిడదవోలు, అనపర్తిలో పి.బి.దేవం-1,2, కాపవరం,సీతానగరం మండలం కాటవరం ఉన్నాయి.23,745 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులు,నిర్వహణకు రూ.195 కోట్ల 60 లక్షలతో అంచనాలు పంపించారు.
- అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 4 పథకాలున్నాయి. రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో చింతలమోరి, వసంతవాడ ఉన్నాయి. మొత్తం 4,970 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులు, నిర్వహణకు రూ.34 కోట్ల 8 లక్షల 37వేలతో అంచనాలు సిద్ధంచేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో పల్లిపాలెం-1,2 పథకాలున్నాయి. 927 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులు, నిర్వహణకు రూ.3.48 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు.
- కాకినాడ జిల్లాలో 14 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. పెద్దాపురం నియోజకవర్గంలోని వేట్లపాలెం, కట్టమూరు, కట్టమూరుమినీ, పెద్దాపురం-1,2, జి.మేడపాడు, పెదబ్రహ్మదేవం-3, కాకినాడ రూరల్‌లో వేములవాడ-2, పెద్దాపురపాడు, గొర్రిపూడి, వేములవాడ- అనపర్తి నియోజకవర్గం పరిధి పెదపూడి, దోమాడ, జగ్గంపేట నియోజకవర్గంలో సోమవరం పథకాలున్నాయి. 13,710 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులు, నిర్వహణకు రూ.122కోట్ల 25లక్షల 32వేలు అంచనా వేశారు.



కట్టమూరు ఎత్తిపోతల పథకం

పేదల ఉన్నతికి దాతలు ముందుకు రావాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశం

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్



అమలాపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా 64 వేల బంగారు కుటుంబాలకు చెందిన పేదలను ఉన్నత స్థితికి తీసుకువచ్చేలా దాతలు ముందుకు రావాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. అమరావతి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్లతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో స్వర్ణాంధ్ర, పీ4, పాజిటీవ్ పబ్లిక్ పెర్ఫార్మెన్స్, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన వంటి పథకాల పురోభివృద్ధిపై సమీక్షించారు. ఈ కాన్ఫరెన్సు అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి పేదరికం లేని సమాజం రూపొందాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. దాతలు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు వచ్చి పేదలకు అండగా నిలవాలని కోరారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా, నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్‌ను ఏటా 15 వృద్ధిరేటు లక్ష్యంతో జిల్లాలో ప్రతిష్టంగా అమలు చేసేందుకు నియోజకవర్గ ప్రత్యేక అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక విధానంలో పరిశ్రమల స్థాపనకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని పరిశ్రమల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు.



పోలీస్ టెన్నిస్ కోర్టును రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న దృశ్యం

టెన్నిస్ కోర్టు ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ

అమలాపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని పోలీసు గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన అశోక్ బ్లెసన్ పోలీసు టెన్నిస్ కోర్టును కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు ఉద్యోగులు పాల్గొన్నారు. కలెక్టర్, ఎస్పీలు ఇద్దరూ టెన్నిస్ కోర్టులో కొద్దిసేపు ఆటాడి కోర్టును ప్రారంభించారు. డీఎస్పీ ప్రసాద్, పట్టణ సీఐ వీరబాబు, ఎస్బీ సీఐ రాజశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



రైతులకు 80 శాతం రాయితీతో అందిస్తున్న డ్రోన్లు

డ్రోన్ల వ్యవ'సాయం'



- రైతులకు 80 శాతం రాయితీపై డ్రోన్లు
- సేద్యపు వ్యయంలో ఊరట
- కూలీల కొరతకూ పరిష్కారం
- జిల్లాల యూనిట్‌గా కేటాయింపులు
- సాగులో యాంత్రీకరణ దిశగా ప్రోత్సాహం
- సేద్యంలో కష్టాలను అధిగమించనున్న రైతులు

(ముమ్మిడివరం-ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ సేద్యంలో డ్రోన్లు అందుబాటులోకి రావడంతో రైతులకు సాగులో ప్రోత్సాహం లభించనుంది. కూలీల కొరత.. రోజురోజుకు సేద్యపు వ్యయం పెరగడంతో రైతులు వరిసాగులో గిట్టుబాటు కరువవుతోంది. పురుగుమందుల పిచికారీ, నాట్లు వేయడానికి, కోతలకు సకాలంలో కూలీలు లభించకపోవడంతో రైతులకు సేద్యపు కష్టాలు పెరిగిపోతున్నాయి. వీటిని అధిగమించేందుకు వ్యవసాయశాఖ యాంత్రీకీకరణను ప్రోత్సహిస్తోంది. గతంలో టీడీపీ హయాంలో రాయితీపై యంత్ర పరికరాలను అందించేవారు. ఇవికాక ప్రైవేటు భాగస్వామ్యంతో కస్టమ్ హైరింగ్ సెంటర్లు(సీహెచ్‌సీ) ఏర్పాటుచేసి రైతులకు అద్దె ప్రాతిపదికన యంత్రాలు అందించేవారు. 2018లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 20 కేంద్రాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా నిర్ణయించగా కేవలం ఆరుచోట్ల మాత్రమే ఏర్పాటుచేసినా ప్రభుత్వం నుంచి రాయితీ సకాలంలో అందక వాటి నిర్వహణ కష్టం కావడంతో వాటిని మూసివేశారు. వైసీపీ పాలనలో రాయితీపై యంత్రాల సరఫరా పథకం అమలుచేసిన దాఖలాలే లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను యాంత్రీకీకరణ వైపు ప్రోత్సహించేందుకు తాజాగా రైతు గ్రూపులకు పురుగుమందులు నానో (ద్రవరూప ఎరువులు) పిచికారీ చేసేందుకు 80 శాతం రాయితీపై డ్రోన్లను సరఫరా పెద్దఎత్తున చేపట్టింది.

యూనిట్ ధర ఎంతంటే...

డ్రోన్ యూనిట్ ధర రూ.9 లక్షల 80 వేలు కాగా 80 శాతం ప్రభుత్వ రాయితీపై అందిస్తున్నారు. గతంలో రూ.4 లక్షల 90వేలు బ్యాంకు రుణం ఇస్తుండగా రూ.4 లక్షల 90వేలు ముందుగా కట్టాల్సి ఉండేది. అనంతరం ప్రభుత్వ రాయితీ రూ.7లక్షల 84వేలు తిరిగి బ్యాంకులో రైతు ఖాతాకు జమయ్యేది. రైతులు అంత మొత్తం కట్టలేకపోవడంతో కొంత వెసులుబాటు కల్పించారు. రైతులు రూ.2 లక్షలు ముందుగా బ్యాంకులో చెల్లిస్తే రూ.7లక్షల 84వేలు రాయితీని ప్రభుత్వం 15 రోజుల వ్యవధిలో బ్యాంకులోని రైతు ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తోంది.

అర్హతలు ఏంటంటే..

అన్ని సామాజిక వర్గాలను కలుపుకుని ఐదుగురు సభ్యులతో కిసాన్ డ్రోన్ రైతు మిత్ర గ్రూపు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. గ్రూపులో కన్వీనర్, కోకన్వీనర్, మరో ముగ్గురు సభ్యులు ఉండగా, కన్వీనర్, కోకన్వీనర్‌లు కనీస విద్యావంతులై ఉండాలి. రైతులు ఒక గ్రూపుగా ఏర్పాటైన తర్వాత బ్యాంకులో ఆధార్, పాన్‌కార్డు, ఫోన్ నెంబరు లింకేజీ బ్యాంకుకు అందించి సిబిల్ రేటింగ్ అర్హత పొందాలి. బ్యాంకు అనుమతి పొందిన వారికే డ్రోన్ మంజూరవుతుంది. గ్రూపుగా ఏర్పాటైన రైతులు తప్పనిసరిగా సొంత భూమి కలిగి ఉండాలి. డ్రోన్ ఆపరేటింగ్‌కు సంబంధించి రైతు మిత్ర కేసుల్లో సభ్యులుగానీ లేదా ఆ గ్రూపు వారు గ్రామంలో ఎవరినైనా ఎంపిక చేసిన వ్యక్తి కనీసం పదో తరగతి లేదా ఐటీఐ వంటి విద్యార్హత కలిగి ఉండాలి. డ్రోన్ నిర్వహణ, ఆపరేటింగ్ విషయాలపై 12రోజులపాటు ఆ వ్యక్తికి ఉచితంగా శిక్షణ ఇస్తారు. గుంటూరు, తాడేపల్లి, ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ సెంటర్లు ఉన్నాయి.

డ్రోన్ అద్దెకు కూడా..



డ్రోన్ పది లీటర్ల సామర్థ్యం కలిగి ఉంటుంది. పురుగుమందు ద్రావణాన్నిగానీ, నానో ఎరువులు ద్రవరూప ఎరువును గానీ పిచికారీ చేసుకోవచ్చు. ఎకరానికి డ్రోన్‌తో పిచికారీ చేయడానికి 4 నుంచి 5 నిమిషాల సమయం పడుతుంది. రైతుమిత్ర గ్రూపులు వారి సొంత పొలాలతోపాటు ఇతరులకు కూడా కొంత రేటు నిర్ణయించి అద్దెకు వాటిని సరఫరా చేయవచ్చు. ఈ డ్రోన్ బ్యాటరీపై నడుస్తుంది. బ్యాటరీలను చార్జింగ్ చేసుకునే అవకాశం ఉంది. ఇతరులకు పురుగుమందు పిచికారీకి అద్దెకు ఇచ్చేటప్పుడు ఎకరానికి రూ. 400 నుంచి రూ.500 వరకు వసూలు చేసుకోవచ్చు. డ్రోన్ వినియోగం వల్ల రైతుకు సమయం ఆదా అవ్వడంతోపాటు కూలీల కొరత ఇబ్బంది ఉండదు. కోనసీమ కూలీల కొరత రైతులను వెంటాడడంతో వరిసేద్యంలో యంత్రాల వినియోగం వైపు దృష్టి సారిస్తున్నారు.

కోనసీమ జిల్లాలో 40 డ్రోన్లు

డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 40 డ్రోన్లు మంజూరుకాగా, ఇప్పటివరకు 13 మండలాల్లో 20 రైతు మిత్ర గ్రూపులకు అందించగా మరో నాలుగు గ్రూపులకు డ్రోన్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఎనిమిది గ్రూపులకు సంబంధించి బ్యాంకు సిబిల్ రేటింగ్ లేక ఆయా గ్రూపులకు అర్హత కోల్పోయాయి. మరో ఎనిమిది గ్రూపులు డ్రోన్లు తీసుకునేందుకు అంతగా ఆసక్తి చూపలేనట్టు జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తెలిపారు. అర్హత ఉన్న గ్రూపులు డ్రోన్లు తీసుకోవడానికి ముందుకొస్తే ఇవ్వడానికి వ్యవసాయశాఖ సిద్ధంగా ఉందన్నారు.



రాజోలులో హెడ్ పోస్టాఫీసును ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రతి పోస్టల్ ఉద్యోగీ ఓ మొబైల్ ఏటీఎం

ఇకపై అందుబాటులో లేని సేవలంటూ ఉండవు.. అభివృద్ధి దిశగా పోస్టాఫీసులు

కేంద్ర కమ్యూనికేషన్స్ గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి పెమ్మసాని

రాజోలులో రూ.2.27 కోట్లతో నిర్మించిన హెడ్‌పోస్టాఫీస్‌కు ప్రారంభోత్సవం

రాజోలు,జూలై17(ఆంధ్రజ్యోతి): ప్రతీ పోస్టల్ ఉద్యోగిని మొబైల్ ఏటీఎంగా మార్చే ప్రత్యేక కార్యక్రమం చేపట్టబోతున్నామని కేంద్ర కమ్యూనికేషన్స్ గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ప్రతీ గ్రామంలో పోస్టాఫీసు ద్వారా అందుబాటులో లేని సేవలేవీ ఇకపై ఉండవన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో పోస్టాఫీసులన్నీ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం రాజోలులో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.2 కోట్ల 27లక్షల 45 వేలతో నూతనంగా నిర్మించిన రాజోలు హెడ్ పోస్టాఫీసు కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం శివకోడు శ్రీమంగెన గంగయ్య తెలగా కల్యాణ మండపంలో అమలాపురం ఎంపీ హరీష్‌బాలయోగి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాతకాలంలో పోస్టాఫీసు అంటే కేవలం లేఖలు పంపించే ప్రదేశం మాత్రమే అనిపించేదని, కానీ ఈ రోజుల్లో సేవింగ్స్, పేమెంట్స్ బ్యాంకు, పార్శిల్, డెలివరీ కేంద్రంగా మారిందన్నారు. కేవలం ఒకట్రెండు రోజుల్లోనే డెలివరీ వంటి సాంకేతిక సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గతేడాది రూ.5 వేల కోట్లతో దేశవ్యాప్తంగా పోస్టల్ ఐటీ వ్యవస్థను పునరుద్ధరించిందని తెలిపారు. ప్రతీ పోస్టాఫీసుకు ఆధునిక సాంకేతికత అందజేశామని పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా వందలాది కోట్ల రూపాయలు గ్రామాల్లో పోస్టాఫీసు సేవల ద్వారానే చేరాయని అన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ విశిష్ట సేవలు అందిస్తున్న పోస్టల్ శాఖ ప్రజల మధ్య వారధిగా పనిచేస్తుందన్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి మాట్లాడుతూ పోస్టల్ వ్యవస్థ అభివృద్ధి కోసం తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. అనంతరం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మిడి ఇజ్రాయిల్ ప్రసంగించారు. తొలుత రాజోలు హెడ్ పోస్టాఫీసు ఆవరణలో శిలాఫలకాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మట్టా శైలజ, ఎంపీటీసీ కె.పుష్పలత, సర్పంచ్ ఆర్.జ్యోతి, జాయింటి కలెక్టర్ టి.నిషాంతి, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ బీపీ శ్రీదేవి, విశాఖపట్నం రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ డీఎస్వీఆర్ మూర్తి, రాజోలు హెడ్ పోస్టుమాస్టర్ జి.శివప్రసాద్, తహశీల్దార్ సీహెచ్ భాస్కర్, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, సెక్రటరీ రెహ్మాన్ పాల్గొన్నారు.



అమలాపురంలో..



రాజమహేంద్రవరంలో..

వానొచ్చింది!

ఆషాఢం ఎండలు దంచి కొడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోహిణీ కార్తె మాదిరిగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు గత కొన్నిరోజులుగా ఎండ వేడిమికి తల్లడిల్లుతున్నారు. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. అమలాపురం, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో చిరుజల్లులతో ప్రారంభమై ఒక్కసారిగా వాన దంచికొట్టింది. ఆకాశంలో మేఘాలు అలా తొలగిపోగానే మళ్లీ భానుడు కొన్నిచోట్ల తన ప్రతాపాన్ని చూపించాడు. దాంతో ఒక్కసారిగా గుబులు రేగి జనం మళ్లీ చెమటలతో తడిసి ముద్దయ్యారు. రాజమహేంద్రవరం పరిసరాల్లో మాత్రం చల్లదనంతో జనం ఊపిరిపీల్చుకున్నారు.

- అమలాపురం రూరల్/ రాజమహేంద్రవరం

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి : చినరాజప్ప



పెద్దాపురంలో ఉప తపాలా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం పోస్టల్ భవనాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన పెమ్మసాని

పెద్దాపురం,జూలై17(ఆంధ్రజ్యోతి): తపాలా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. కాకినాడ జిల్లా పెద్దాపురం రామారావుపేటలో రూ.1.70 కోట్లతో నిర్మించిన ఉప తపాలా కార్యాలయ భవనాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్లశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ తపాలా శాఖ తన సేవల విస్తరణలో మరో ముందడుగు వేసిందన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ తపాలా శాఖ గ్రామీణ ప్రాంతాల్లో సైతం డిజిటల్ సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, పోస్టల్ సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ అనిల్, రామకృష్ణ, రమణమూర్తి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



అలుమ్ని ఆడిటోరియంలో జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, జేఎన్టీయూకే అధికారులు

ప్రముఖుల పరిశోధనలు సమాజానికి ఎంతో దోహదం

- ఎన్‌బీఏ, న్యాక్ చైర్మన్ అనిల్ సహస్ర బుద్దే
- రోల్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీపై జేఎన్టీయూకేలో వర్క్ షాప్

జేఎన్టీయూకే, జూలై 17 (ఆంధ్రజ్యోతి): యూసీఈకే ఓక్ ఉత్సవాల సందర్భంగా జేఎన్టీయూకేలోని అలుమ్ని ఆడిటోరియంలో 'రోల్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ- 2020 ఇన్ స్వర్ణాంధ్ర వికసిత్ భారత్-2047' అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ గురువారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. నలుగురు ముఖ్య ఉపన్యాసకులు పాల్గొనగా... మొదటిగా ఎన్‌బీఏ, న్యాక్ చైర్మన్ అనిల్ సహస్ర బుద్దే ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ భారతదేశంలో పూర్వకాలంలో నిర్వహించిన తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాల సంస్కృతిని కొనియాడారు. వర్గీస్ కురియన్, స్వామినాథన్, ఎఫ్‌సీ కోహ్లీ మొదలైన ప్రముఖుల పరిశోధనలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడ్డాయని వివరించారు. భారతదేశంలో పరిశోధనలకు ఐదు శాతం మాత్రమే నిధులు మంజూరవుతున్నాయని, దీనివల్ల పరిశోధనలు కుంటుపడుతున్నాయన్నారు. 2047కల్లా అందరికీ ఆహారం, నీరు, వసతి, ఉపాధి, అంతర్జాలం, విద్య, నైపుణ్యాలు, విద్యుత్, సుపరిపాలన ప్రజలకు పుష్కలంగా అందేలా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అనంతరం న్యూఢిల్లీకి చెందిన సౌత్ ఏషియన్ యూనివర్శిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేకే అగర్వాల్ మాట్లాడుతూ నూతన విద్యా విధానం-2020 పట్టభద్రులను అందించడమే కాకుండా సమాజానికి పరిపూర్ణమైన వ్యక్తులను అందించే విధంగా రూపొందించబడిందన్నారు. పరీక్షల సమయాన్ని 3 నుంచి 2 గంటలకు కుదిస్తే విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావడం తేలిక అవుతుందన్నారు. యూజీసీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వేద్‌ప్రకాష్ మాట్లాడుతూ ప్రాథమిక విద్యను తప్పనిసరి చేయాలని, ఉన్నత విద్యలో ప్రతిభకు పట్టం కట్టాలన్నారు. సుందర్ పిచాయ్ ఐఐటీలో కాకుండా చిన్న కళాశాలలో చదివారన్నారు. అమెరికా జీడీపీలో పరిశోధనలకు 3.9 శాతం కేటాయిస్తారని, మన దేశంలో 0.65 శాతానికే పరిమితమైపోయిందన్నారు. ఆన్‌లైన్, దూర విద్యకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. పూర్వ విద్యార్థి, చెన్నయ్ ఐఐటీ సీఎస్ఈ ప్రొఫెసర్ డి.జానకిరాం మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు ఎక్కువ ఒత్తిడికి గురవుతున్నారన్నారు. కళలు, క్రీడలు, పుస్తకపఠనంపై ఆసక్తి కలిగించి ఒత్తిడి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రోల్ ఆఫ్ ఇండస్ట్రియలిస్ట్‌ టు కొలాబరేటివ్ విత్ అకడమిక్ ఇనిస్టిట్యూషన్స్ టు రియలైజ్ ఆబ్జెక్టివ్స్ ఆఫ్ స్వర్ణాంధ్ర వికసిత్ భారత్ 2047పై ప్యానల్ చర్చ నిర్వహించారు. దీనికి వర్శిటీ పూర్వ విద్యార్థి వీవీ రావు అధ్యక్షత వహించగా డాక్టర్ సరోజ అగర్వాల్, డాక్టర్ సిమ్లా, వీటీ చంద్రశేఖర్, దాసరి రామకృష్ణ, కేవీఆర్ఎస్ మూర్తి, సూర్యప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ ఎంఎం పళ్లంరాజులను సత్కరించారు. వర్క్‌షాప్‌లో రెక్టార్ వీవీ సుబ్బారావు, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, ఓఎస్డీ కోటేశ్వరరావు, ఓక్ ఉత్సవ కమిటీ చైర్మన్ పి.ఉదయభాస్కర్, వైస్ చైర్మన్ శ్రీనివాసకుమార్, పలువురు డైరెక్టర్లు, యూసీఈకే ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజును సత్కరిస్తున్న ఉప కులపతి ప్రసాద్, అతిథులు





గురువారం సాయంత్రం జేఎన్టీయూకే అనుబంధ కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు



సీఎం చంద్రబాబు సమక్షంలో కేంద్ర సహాయ మంత్రిని కలిసిన కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

'కాకినాడలో క్రీడల అభివృద్ధికి సహకరించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పార్లమెంటరీ పరిధిలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా క్రీడలను అభివృద్ధి చేసేందుకు 'ఖేలో ఇండియా' కింద మౌలిక వసతులు కల్పించాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌లతో కలిసి కేంద్ర క్రీడల శాఖ సహాయ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను ప్రత్యేకంగా కలిసారు. ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. వచ్చే ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో మార్షల్ ఆర్ట్స్ గేమ్స్ నిర్వహించే అవకాశం కల్పించినందుకు కేంద్ర సహాయ మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా శ్రీదేవి



కాకినాడ క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పెంకే శ్రీదేవిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె కాకినాడ బార్ అసోసియేషన్‌లో 24 ఏళ్లుగా న్యాయవాదవృత్తిలో కొనసాగుతున్నారు. శ్రీదేవిని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి సుబ్రహ్మణ్యం, సీహెచ్ చంటి, పలువురు న్యాయవాదులు అభినందించారు.



ఏపీఈపీడీసీఎల్ నాయకులను సత్కరిస్తున్న దృశ్యం

క్షేత్ర స్థాయిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ట్రాన్స్‌కో ఉమ్మడి రాజమహేంద్రవరం సర్కిల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

కాకినాడ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, జేఎల్ఎం జీఆర్-2 కార్మికులకు డిపార్ట్‌మెంట్ రూల్స్ వర్తింపజేయాలని ట్రాన్స్‌కో ఉమ్మడి రాజమహేంద్రవరం సర్కిల్ జిల్లా అధ్యక్షుడు పీఎస్ఎస్ వెంకటేశ్వరరావు కోరారు. గురువారం కాకినాడలోని శాంతిభవన్ సమావేశ హాలులో ఏపీఈపీడీసీఎల్ ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎ.రాజారత్నం మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, పెరిగిన పని భారానికి అనుగుణంగా అదనపు పోస్టులు మంజూరు చేయాలని కోరారు. జిల్లా కోశాధికారి ఎస్‌కే బషీర్ మాట్లాడుతూ నాలుగు డీఏలను సత్వరం చెల్లించాలన్నారు. రాష్ట్ర నాయకులు టీసీహెచ్ వెంకటరావు, సరెళ్ల సత్యనారాయణ, దమ్ము సత్తిబాబు, జిల్లా ప్రచార కార్యదర్శి రమేష్ (జగన్), రామచంద్రపురం డివిజన్ అధ్యక్షుడు ఎంసీహెచ్ఎస్ఎస్ కుమార్‌బాబు, కార్యదర్శి పీవీ రమణ, అమలాపురం డివిజన్ అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, కార్యదర్శి బీసీహెచ్ సాహెబ్, రాజమహేంద్రవరం టౌన్ డివిజన్ అధ్యక్షుడు జి.గణేష్, కార్యదర్శి కె.శ్రీనివాస్, రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ అధ్యక్షుడు ఎంసీహెచ్ అప్పలరాజు, కార్యదర్శి పిల్లి ప్రసాద్, కోశాధికారి శివ, జగ్గంపేట డివిజన్ అధ్యక్షుడు నాయుడు, కార్యదర్శి రాజు, కాకి నాడ డివిజన్ అధ్యక్షుడు కె.జాన్‌వెస్లీ, కార్యదర్శి నాగేంద్ర, పైడిరాజు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు. ఆయా డివిజన్ల నాయకులు తమ డివిజన్లలోని వివిధ సమస్యలపై చర్చించారు.

జాతీయ జూనియర్ హాకీ ఉమెన్ చాంపియన్‌షిప్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు

సక్రమ ఏర్పాట్లు చేయాలి

కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జాతీయ జూనియర్ హాకీ ఉమెన్ చాంపియన్‌షిప్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ సక్రమ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కాకినాడ జిల్లా జాయింట్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. ఈ రెండింటికి సంబంధించి కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం ఆయన జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, ఆర్డీవో మల్లిబాబు, మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనరు సుధాకర్, ఎస్ఈ వెంకటరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కృష్ణారావు, హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 20వ వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, 3 నుంచి 20వ తేదీ వరకు జాతీయ జూనియర్ హాకీ చాంపియన్‌షిప్ కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతాయన్నారు. ఆర్మీ ర్యాలీకి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13 ఉమ్మడి జిల్లాల నుంచి అభ్యర్థులు హాజరు కానున్నారు. హాకీ పోటీలకు దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది మహిళా క్రీడాకారులు, 200 మంది సహాయక సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో రోజుకు సుమారు 800 పాల్గొనే అవకాశమున్న నేపథ్యంలో అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జేసీ ఆదేశించారు.

సత్యదేవా.. అసత్యం కనవా..!

- నకిలీ రసీదులతో పీఎఫ్ కాజేసేందుకు ఏజెన్సీ కుట్ర
- ఆలయంలో పనిచేస్తున్న 350 మంది పారిశుధ్య కార్మికులు
- దేవస్థానంలో ఒక అధికారి వెనకుండి నడిపించిన వైనం
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన..


అన్నవరం ఆలయ దేవస్థానం

అన్నవరం, జూలై17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో పారిశుధ్య కార్మికులను సరఫరా చేసే కనకదుర్గ కాంట్రాక్ట్ సంస్థ ఆలయ అధికారులనే బురిడీ కొట్టించింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే ఆలయంలో సుమారు 350 మంది వరకు పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరి మూడునెలల పీఎఫ్ సొమ్మును తన జేబులో వేసుకునే దురుద్దేశంతో సంబంధిత ఏజెన్సీ మోసానికి పాల్పడినట్టు తెలుస్తోంది. ఈ విషయం శానిటరీ విభాగంలో పనిచేస్తున్న ఓ అధికారికి తెలిసినప్పటికీ ... ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా మిన్నకుండిపోయి తన పాత్ర పోషించినట్టు విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకి వెళితే అన్నవరం దేవస్థానంలో పారిశుధ్య కార్మికుల సరఫరాకు నెలకు రూ. 59 లక్షలు దేవస్థానం చెల్లించేలా దేవాదాయశాఖ కమిషనర్ అనుమతితో ఒక సంస్థ నామినేట్ చేసుకుంది. అయితే పారిశుధ్య కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలు ఈ సంస్థకు చెల్లిస్తే వారు కార్మికులకు నెలవారీగా అందించాలి. దీంతోపాటుగా పీఫ్ సొమ్మును కాంట్రాక్ ఏజెన్సీ కార్మికుల ఖాతాకు జమచేయాలి. కాంట్రాక్ట్ సంస్థ పీఎఫ్ డబ్బులు సరిగ్గా చెల్లించినట్టు దేవస్థానం అధికారులకు చూపితేనే దేవస్థానం ఆ నిధులు విడుదల చేస్తుంది. ఇక్కడే సదరు సంస్థ తన కుయుక్తిని ప్రదర్శించింది. మార్చి నుంచి పీఎఫ్ చెల్లించినట్టు నకిలీ రశీదులు చూపించి దేవస్థానం నుంచి మొత్తాన్ని జమ చేసుకుని కార్మికుల జీతాలు మాత్రమే చెల్లించి, పీఎఫ్ సొమ్ము చెల్లించకుండా జాప్యం చేసింది. ఈ విషయాన్ని వారంరోజుల క్రితం చైర్మన్ రోహిత్ దృష్టికి పారిశుధ్య కార్మికులు తీసుకెళ్లగా, ఆయన దేవస్థానం శానిటరీ విభాగ అధికారులతో మాట్లాడి, ఇందులో సంబంధిత ఏజెన్సీ ఉంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించగా, ఆగమేఘాలపై మూడునెలల పీఎఫ్ సొమ్మును ఈనెలలో మూడు విడతలగా కార్మికుల ఖాతాల్లో సదరు సంస్థ జమచేసింది. ఇంతా జరుగుతున్నా ... శానిటేషన్ విభాగ అధికారులు ఏమి చేస్తున్నారనే విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. ఈ విషయం ఈవో సుబ్బారావు దృష్టికి చేరడంతో దీనిపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని శానిటరీ విభాగ ఏఈవో, సూపరెంటెండెంట్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించడంతో గురువారం వారు దీనిపై విచారణ చేపట్టగా, మూడు నెలల సొమ్ములకు నకిలీ రసీదులు సృష్టించి వాటికి సంబంధించి ఈనెలలో మూడు విడతలగా సిబ్బంది పీఎఫ్ ఖాతాల్లో జమ చేసినట్టు గుర్తించారు. అయితే మోసానికి పాల్పడిన ఈ సంస్థపై చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచిచూడాలి. ఈ విషయం బయటకు పొక్కకుంటే త్వరలోనే ప్రధానాలయాలన్నింటికీ సెంట్రలైజ్డ్ కాంట్రాక్ట్ ఖరారవుతుందనే సమాచారంతో ప్రస్తుత ఏజెన్సీ సంస్థ వాటిని కాజేయాలనే దురుద్దేశంతో ఈ మోసానికి పాల్పడినట్టు తెలుస్తోంది.

అంతర్జాతీయ మార్కెట్‌కు గిరిజన ఉత్పత్తులు

- హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ హరిప్రసాద్


కార్యక్రమంలో మాట్లాడుతున్న హరిప్రసాద్

రంపచోడవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): గిరిజన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. రంపచోడవరం మండలం ఆర్కా రెస్టారెంట్‌లో జనసేన నాయకుడు కుర్ల రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన గిరిజనులు వెదురు ఉత్పత్తుల ప్రదర్శనకు హరిప్రసాద్, ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు తయారు చేసిన ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు పొందేందుకు అవసరమైన అనుమతులు తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కళలపై ఉన్న మక్కువతోనే హస్తకళలను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇటీవల దేశ వ్యాప్తంగా జరిగిన వన్ డిస్ట్రిక్ వన్ ప్రైస్ అనే హస్తకళల ప్రదర్శనలో 29 బహుమతులకు రాష్ట్రానికి 10 బహుమతులు వచ్చాయన్నారు. ఎమ్మెల్యే శిరీషదేవి మాట్లాడుతూ కూటమిప్రభుత్వం ఇటువంటి కళలు జాతీయస్థాయిలో గుర్తింపు పొందేందుకు ప్రోత్సహిస్తోందన్నారు. హస్త కళల కార్మికులకు ప్రోత్సాహక రుణాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలిశెట్టి సూర్యనారాయణ, అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి వంపురి గంగులయ్య, లీగల్ సెల్ అధ్యక్షుడు కాకి స్వామి, మండలాధ్యక్షుడు పాపోలు శ్రీనివాస్, 11 మండలాల జనసేన మండలాధ్యక్షులు, వీరమహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు విద్యార్థులకు అస్వస్థత

- ఎండ వేడిమే కారణం


ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శిస్తున్న ఎంఈవో, తహశీల్దార్

జగ్గంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం కాండ్రేగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎండ తీవ్రత కారణంగా విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురయ్యారు. పి.దివ్య (ఎనిమిదో తరగతి), ఏ.మేరీ (ఏడో తరగతి), జి.దుర్గాభవాని (పదో తరగతి), సీహెచ్ దివ్య (పదో తరగతి), ఎం. పావని (పదోతరగతి), ఎ.గనిక లక్ష్మి (ఎనిమిదో తరగతి) ఉన్నారు. ఉదయం పది గంటలకు వారు కళ్లు తిరిగిపోవడంతో ఉపాధ్యాయులు గుర్తించారు. వెంటనే విద్యాకమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు స్పందిస్తూ ఇద్దరిని జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో, మరో నలుగురు ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. విద్యార్థులను తహశీల్దార్ రమేష్, ఎంఈవో ఆర్.స్వామి పరామర్శించారు. వారి పరిస్థితి క్షేమంగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఇప్పటికైనా విద్యార్థులకు విశాలమైన తరగతి గదుల్లో విద్యాబోధన చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ట్రాక్టర్‌ను తగలబెట్టిన దుండగులు

ముమ్మిడివరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఓ రైతు మకాంలో ఉన్న ట్రాక్టర్‌ను బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు పెట్రోలు పోసి నిప్పంటించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరుకు చెందిన చవటపల్లి సత్యనారాయణకు ముమ్మిడివరం మండలం అయినాపురం శివారు గొరగనమూడి సమీపంలో కొబ్బరితోటలో మకాం ఉంది. అందులో పెట్టగా... దుండగులు ఇంజన్ స్టార్ట్ చేసి పెట్రోలు పోసి నిప్పంటించారు. దీంతో ట్రాక్టర్ టైర్లు, ఇంజను భాగం కాలిపోయింది. దీనిపై సదరు ట్రాక్టరు యజమాని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ట్రాక్టరు విలువ సుమారు రూ. ఐదు లక్షలు ఉంటుందన్నారు. అమలాపురం డీఎస్పీ ప్రసాద్ ఆదేశాల మేరకు ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి వెళ్లి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. ట్రాక్టరు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం ఎస్ఐ జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చాకుతో పొడిచి... పరారై..!

- ప్రియుడి చేతిలో ప్రియురాలి దారుణ హత్య
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బి.సావరంలో ఘటన
- రెండు ప్రత్యేక పోలీస్ బృందాలు గాలింపు


ఒలేటి పుష్ప (ఫైల్‌ఫొటో)

రాజోలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం బి.సావరంలో గురువారం విషాదం చోటుచేసుకుంది. ప్రియుడి చేతిలో ప్రియురాలు దారుణ హత్యకు గురైంది. దీనికి సంబంధించి రాజోలు ఎస్ఐ రాజేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బి.సావరం సిద్ధార్థ నగర్‌లో ఓలేటి పుష్ప (22), షేక్ షమ్మా(22) ఓ అద్దె ఇంట్లో ఉంటూ సహజీవనం చేస్తున్నారు. పుష్పకు గతంలో వివాహమై భర్త నుంచి విడాకులు తీసుకుంది. ఈమెకు రాజోలుకు చెందిన ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్న షేక్ షమ్మాతో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. అయితే షమ్మా చెడు వ్యసనాలకు లోనై డబ్బు మోజులో పడి గత కొన్ని రోజులుగా మద్యం తాగొచ్చి పుష్పతో వ్యభిచారం చేయాలని ఒత్తిడి చేస్తున్నాడు. బుధవారం రాత్రి కూడా ఇదే విషయంపై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీనికి పుష్ప నిరాకరించడంతో కోపోద్రికుడైన షమ్మా ఆమెను చాకుతో పొట్ట, కాలిపై పొడిచి హత్య చేశాడు. దీన్ని అడ్డుకునే ప్రయత్నం చేసిన పుష్ప తల్లి గంగ, సోదరులను కూడా గాయపరిచి పరారయ్యాడు. తీవ్రంగా రక్తస్రావమైన పుష్ప ఘటనా స్థలంలోనే మృతిచెందింది. డబ్బుల కోసం తన కూతురును మానసికంగా వేధించేవాడని మృతురాలి తల్లి గంగ విలపిస్తోంది. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ టీవీ నరేష్‌కుమార్ వచ్చి పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు.

‘పురుషోత్తపట్నం’ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

- రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసా నంద సరస్వతి స్వామి


మాట్లాడుతున్న శ్రీనివాసానంద స్వామి

ఎటపాక, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపట్నంలోని దేవస్థానం భూముల్లో నెలకొన్న భూ వివాదం ఎనిమిది దశాబ్దాలుగా కొనసాగుతోందని, దీనిపై రైతులు, భద్రాచలం దేవస్థానం అధికారులు కమిటీలుగా ఏర్పడి సామరస్యంగా పరిష్కరించుకోవాలని రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామి, సాధు పరిషత్ గౌరవ అధ్యక్షుడు అట్లూరి నారాయణరావు అన్నారు. శ్రీనివాసానంద సరస్వతి స్వామి, గౌరవ అధ్యక్షుడు నారాయణరావుతోపాటు హిందూ సంఘాల నాయకులు గురువారం పురుషోత్తపట్నంలోని దేవస్థానం అధికారులు, స్థానిక రైతుల మధ్య జరుగుతున్న భూవివాదంపై నిజనిర్ధారణ కమిటీగా పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామంలో తరతరాలుగా ఈ భూమిని నమ్ముకుని జీవిస్తున్న వారికి అన్యాయం చేస్తే ఊరు కోబోమన్నారు. దేవస్థానం అధికారులు భూములకు పర్యవేక్షకులుగా ఉండకుండా ఉన్న భూములను అమ్మేస్తున్నారని ఆరోపించారు. రామయ్య భూములు అన్యమతస్థుల ప్రార్థనా మందిరాలు, మిషనరీ స్కూళ్లకు 20 ఎకరాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. వారికి దేవస్థానం అధికారులు నోటీసులు ఇవ్వాలని సూచించారు. ఎటపాక సీఐ కన్నపరాజు ఆధ్వర్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

మందుబాబులకు జైలు, జరిమానా

కాకినాడ క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి కాకినాడ ఐదో ఏజేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ ఎస్‌కే షరీన్ జైలు, జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ 1, 2 సీఐలు ఎన్. రమేష్, డి.రామారావు తమ సిబ్బందితో బుధవారం రాత్రి బ్రీత్ ఎనలైజర్లతో పరిక్షించగా వీరంతా పట్టుబడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి ఇందులో ఒకరికి నాలుగు రోజులు, మరో ఇద్దరికి మూడురోజులు, మరో నలుగురికి రెండు రోజులు , ఇద్దరికి ఒకరోజు చొప్పున జైలు శిక్ష విధించారు. మరో తొమ్మిది మందిలో ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున మొత్తం రూ. 90,000 జరిమానా విధించినట్టు సీఐ రమేష్ తెలిపారు. పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెరవలి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పెరవలి మండలంలోని జాతీయ రహదారి ఖండవల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం తెల్లవారుజామున ఆచంట మండలం వల్లూరుకి చెందిన నార్కిమిల్లి వెంకటేశ్వరరావు (42) అనే వ్యక్తి ట్రాక్టర్‌పై పంగిడి నుంచి మెటల్ వేసుకురావడానికి తన గ్రామం నుంచి బయలుదేరాడు. ఈక్రమంలో ఖండవల్లి వద్దకు వచ్చేసరికి రోడ్డుపై అడ్డుగా ఏర్పాటు చేసిన వేగ నియంత్రణ ఐరన్ డ్రమ్ములను గమనించకపోవడంతో ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న వెంకటేశ్వరరావు ట్రాక్టర్‌పై నుంచి రోడ్డుపై పడిపోవడంతో ట్రాక్టర్ ట్రాలీ టైరు అతనిపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

జంతు సంరక్షణలో హైకోర్టు ఆదేశాలు పాటించాలి

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత


సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలను అనుసరిస్తూ జంతువుల సంరక్షణ కోసం తప్పనిసరిగా సొసైటీలను నియమించాలని, షెల్టర్‌లను ఏర్పాటు చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. జంతువులపై హింస నివారణకు సొసైటీల ఏర్పాటు, నియంత్రణ నియమాలు, కార్యాచరణపై గురువారం ఆమె ఉమ్మడి తూర్పుగోదావరిలోని వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కొన్ని చోట్ల సొసైటీలు, షెల్టర్‌లు లేవని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం చొరవ చూపి వాటిని ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన స్థలం, నిధులు కేటాయించాల్సిందిగా కలెక్టర్లకు లేఖ రాస్తామన్నారు. సొసైటీల వివరాలు, వాటి ద్వారా సంరక్షించిన జంతువుల సంఖ్య తదితర సమాచారాన్ని ప్రతి నెలా డీఎల్ఎస్ఏకు అందజేయాలన్నారు. హైకోర్టు తీర్పులో సూచించిన జంతు సంరక్షణ చర్యలను తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తే కోర్టు ధిక్కారణ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని పీడీజే హెచ్చరించారు. జంతువులకు కూడా హక్కులు ఉంటాయన్నారు. వాటిని తరలించే సమయంలో పశుగ్రాసం, నీరు తప్పక అందించాలన్నారు. వాహనాల్లో కనీసం కదిలే అవకాశం కూడా లేకుండా జంతువులను తరలించడం క్రూరత్వం కిందకు వస్తుందన్నారు. ఇలా అక్రమంగా జంతువులను తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసు, రవాణా శాఖలను ఆదేశించారు. పట్టణాలు/నగరాల్లో జంతువులను రోడ్లపై వదిలిపెట్టరాదన్నారు. గాయపడిన జంతువుల చికిత్సకు అంబులెన్సులు ఉన్నాయని, ఆ సదుపాయాన్ని నెం.1962కి ఫోన్ చేయడం ద్వారా వినియోగించుకోవచ్చని ప్రధాన న్యాయమూర్తి వెల్లడించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఏసీబీ కోర్టు జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల రెన్యువల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): జోన్-1, జోన్-2 పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకులను 2025-2026 విద్యాసంవత్సరానికి రెన్యువల్ చేయడానికి దరఖాస్తులు కోరుతున్నామని రాజమహేంద్రవరంలోని కళాశాల విద్యాశాఖ ప్రాంతీయ విద్యాసంయుక్త సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. జోన్-1లో 139, జోన్-2లో 178 పోస్టులకు రెన్యువల్ చేయనున్నట్టు చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ నాటికి కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేసిన వారు మాత్రమే అర్హులని, అలాగే 2025, జూన్ 1వ తేదీ నాటికి 60 ఏళ్లు నిండిన వారు రెన్యువల్‌కు అర్హులు కాదని తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకులు ఈనెల 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌కు దరఖాస్తు చేసుకోవాలని, 21 నుంచి 23వ తేదీ వరకూ జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో కౌన్సిలింగ్ జరుగుతుందని తెలిపారు. రెన్యువల్ అయిన అధ్యాపకులు 25వ తేదీన అగ్రిమెంట్ చేసుకోవాలని ప్రాంతీయ విద్యా సంయుక్త సంచాలకులు పేర్కొన్నారు.

ముంచుకొస్తున్న మలేరియా

- కోతులగుట్ట ఆస్పత్రిలో రోజుకు పది కేసులు
- బ్రెయిన్ మలేరియా కేసులు ఎక్కువగానే వస్తున్నాయి: డాక్టర్ మహేష్‌బాబు


కోతులగుట్టలో మలేరియాతో బాధపడుతున్న మహిళను పరీక్షిస్తున్న డాక్టర్ మహేష్‌బాబు

కూనవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని విలీన మండలాల్లో మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. రోజురోజుకు జ్వరాలు పెరగడంతో రోగులు ఆసుపత్రి బాట పడుతున్నారు. కూనవరం మండలంలోని కోతులగుట్ట ఆస్పత్రి రోగులతో కిక్కిరిసిపోతోంది. రోజుకు 8నుంచి 10 మలేరియా కేసులు నమోదవుతున్నాయి. వీరిలో ఎక్కువగా బ్రెయిన్ మలేరియా కేసులు ఉండడంతో రోగులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని భగవాన్‌పురం గ్రామానికి చెందిన ఓ ఇంట్లో నలుగురికి మలేరియా జ్వరాలు రావడంతో ప్రస్తుతం వారు కోతుల గుట్ట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అడవికి దగ్గర్లో ఉన్న గ్రామాల్లో ప్రతి ఇంట్లో ఒకరు మలేరియా జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం, ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం కారణంగానే ఈ జ్వరాలు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. మండలంలో ప్రజలు మలేరియా జ్వరాలతో ఆస్పత్రి పాలవుతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ మలేరియా జ్వరాలపై కోతుల గుట్ట ఆసుపత్రి సూపరింటెండెంట్ మహేష్ బాబును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా కూనవరం మండలంలో మలేరియా జ్వరాల కేసులు ఎక్కువగా నమోదవుతున్న మాట వాస్తవమన్నారు. ఆస్పత్రిలో రోజుకు ఎనిమిదికి పైగానే మలేరియా కేసులు నమోదవుతున్నాయని ఆయన తెలిపారు. వీరిలో బ్రెయిన్ మలేరియా కేసులు కూడా వస్తున్నాయని, వారికి సరైన చికిత్స అందిస్తున్నామని స్పష్టం చేశారు.

సాధారణ స్థాయికి గోదావరి ప్రవాహం


రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో వరద నీటి ప్రవాహం

ధవళేశ్వరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఉధృతంగా ప్రవహించిన గోదావరి కొద్దిరోజులుగా తగ్గుతూ ప్రవహిస్తూ సాధారణస్థాయికి చేరుకుంటోంది. దీంతో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్లను దించి వేసి నీటి విడుదలను నియంత్రిస్తున్నారు. మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లలోని మొత్తం గేట్లను దించి నీటి విడుదలను నిలిపివేయగా ధవళేశ్వరం, ర్యాలీ ఆర్మ్‌లలోని మొత్తం గేట్లను 10 మిల్లీ మీటర్ల మేర ఎత్తి 36,154 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 5వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2600క్యూసెక్కులు పశ్చిమడెల్టాకు 7200క్యూసెక్కులు చొప్పున 14,800క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద క్రమంగా తగ్గుతున్న నీటి మట్టం గురువారం సాయంత్రానికి 14.50 అడుగులుకు చేరుకుంది.

- డెల్టా కాలువలకు 14,800 క్యూసెక్కుల నీరు విడుదల

చిన్నారి మోహన మృతి బాధాకరం: ఎంపీ


చిన్నారి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న ఎంపీ పురందేశ్వరి

కడియం, జూలై 17(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలో చైనత్యగనర్‌కు చెందిన డొక్కా ఈశ్వర్-శ్రావణిల కుమార్తె మోహన అనే చిన్నారి మృతి చెందడం బాధాకరమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బాధిత కుటుంబాన్ని ఆమె గురువారం పరామర్శించి ఓదార్చారు. మోహనకు స్పైనల్ మస్క్యులర్ అట్రోఫి (ఎస్ఎంఏ) అనే సమస్య ఉందని, వైద్యం కోసం కోట్ల విలువైన ఇంజక్షన్ చేయాలని హైదరాబాద్ వైద్యులు చెప్పగా విషయాన్ని ఎంపీ పురందేశ్వరి దృష్టికి, రాజమహేంద్రవరం వచ్చిన కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మోహన వైద్యం కోసం చర్యలు చేపట్టామని, పీఎంవో కార్యాలయానికి నివేదించడతో పాటు, నిధుల కోసం ప్రయత్నిస్తుండగా మోహన మృతి చెందిందని ఎంపీ విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఆకుల శ్రీధర్, బొర్సు సుబ్రహ్మణ్యం, దాసరి ముత్యం, కొత్తపల్లి శివ, తాలాబత్తుల భాస్కర్, బొప్పన లోవరాజు పాల్గొన్నారు.

అనారోగ్యం తాళలేక ఆత్మహత్య

- రౌతులపూడి సీహెచ్‌సీ ఆవరణలో ఉరివేసుకున్న వృద్ధుడు



రౌతులపూడి, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్లుగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వ్యక్తి ఆసుపత్రి ఆవరణలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆసుపత్రి సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రౌతులపూడి గ్రామానికి చెందిన లోకారపు చిన్న అప్పలనాయుడు(79) ఇరవై ఏళ్లుగా ఆయాసం, కడుపునొప్పి, గుండె సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నాడు. రెండ్రోజుల క్రితం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో బంధువులు స్థానిక సీహెచ్‌సీలో చేర్పించారు. బుధవారం రాత్రి వరకూ చికిత్స తీసుకున్న అతడు గురువారం తెల్లవారేసరికి బంధువులు చూడగా ఆసుపత్రి ఆవరణలో ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఉన్నాడు. ఆసుపత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వగా స్థానిక ఎస్ఐ కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

నిడదవోలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో సైకిలిస్ట్ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. నిడదవోలు మండలం గోపవరం గ్రామంలో గురువారం జరిగిన ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తిని గోపవరం గ్రామానికి చెందిన కొప్పర్తి మహరాజ్(47)గా గుర్తించినట్టు సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు, జూలై 17(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీస్వామి నిత్యాన్నదాన పథకానికి భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ రూ.2,11,999 విరాళం అందించారు. ఆయనకు వేదపండితులు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

అన్నదాన పథకానికి విరాళం

అమలాపురం రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం శ్రీఉమారామలింగేశ్వర దేవాంగ నిత్యాన్నదాన సత్రంలో శాశ్వత అన్నదాన పథకానికి ఉయ్యూరివారి మెరక గ్రామానికి చెందిన కందనాల ముత్యాలరావు-పార్వతి దంపతులు రూ.50వేలు విరాళంగా అందించారు. దాతలను సత్రం చైర్మన్ బొమ్మన దుర్గాప్రసాదరావు అభినందించారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

- మంత్రి డోలా వీరాంజనేయస్వామి
- గురుకుల పాఠశాలల సందర్శన


రాజోలు: శివకోడులో గురుకుల పాఠశాలను సందర్శిస్తున్న మంత్రి వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. గురువారం శివకోడు గురుకుల బాలికల పాఠశాలను దేవ వరప్రసాద్‌తో పాటు ఆయన సందర్శించారు. కిచెన్, స్టోరూమ్, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించి పాఠశాలలో అందుకున్న సౌకర్యాలు, సమస్యలు స్వయంగా తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గురుకులాలు, సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థుల పట్ల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ చూపారని తెలిపారు. గురుకులాలు ఐఐటీ, నీట్, ఎక్సలెన్సీ సెంటర్లు పదికి పెంచామని తెలిపారు. ఐఐటీ నీట్‌లో త్రుటిలో అర్హత కోల్పోయిన విద్యార్థులకు ఐఐటీ నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుండుబోగుల పెదకాపు, చాగంటి స్వామి, ఎంఈవో ఎస్.మనోహరం, ఎంఈవో-2 టీవీ ఎస్‌కేడీ ప్రసాదరావు, ప్రిన్సిపాల్ టి.లలితకుమారి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడుగా మంత్రి డోలా

విద్యార్థితో తాబేలు కథ చెప్పించిన మంత్రి

పి.గన్నవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): నరేంద్రపురం గురుకుల పాఠశాలలో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కాసేపు ఉపాధ్యాయుడుగా మారారు. 5వ తరగతి చదువుతున్న విద్యార్థులను తన ఎదుట కూర్చోపెట్టుకుని ప్రశ్నలు వర్షం కురిపించారు. మీరు ఇప్పటి వరకు ఏం నేర్చుకున్నారని ప్రశ్నించారు. వారి వద్ద నుంచి ఏవిధమైన సమాధానం రాకపోవడంతో కథ చెప్తారా...అని ఓ విద్యార్థిని అడగగా సింహం-తాబేలు కథ చెప్పాడు. కథను మరో విద్యార్థి ముగించడంతో ఇద్దరు విద్యార్థులకు పెన్నులను బహుమతిగా అందించారు. అనంతరం వారికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఐదవ తరగతి విద్యార్థులు ఇప్పుడే గురుకుల పాఠశాలకు వచ్చారు కాబట్టి, వారం రోజులు వారిని ఫ్రీగా వదలాలని అవసరమైతే అలవాటు పడేవరకు ఇంటికి కూడా పంపించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

రాష్ట్రంలో సుస్థిర పాలన అందిస్తాం

- మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి
- పలుచోట్ల సుపరిపాలన కార్యక్రమాలు


పి.గన్నవరం: మొండెపులంకలో కరపత్రం అందిస్తున్న మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ హరీష్


అమలాపురం: పేరూరులో సుపరిపాలన కార్యక్రమంలో మంత్రి డోలా, ఎమ్మెల్యే ఆనందరావు, ఎంపీ హరీష్, ఎమ్మెల్సీ రాజశేఖరం

పి.గన్నవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుస్థిరపాలన తేవాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. నాణ్యమైన, మెరుగైన, సుపరిపాలన అందించే దిశగా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారన్నారు. మొండెపులంక గ్రామంలో టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు అధ్యక్షతన జరిగిన తొలి అడుగు-సుపరిపాలన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2029 నాటికి రాష్ట్రంలో నిరుపేద కుటుంబాలు ఉండకూడదనే లక్ష్యంతో పీ-4కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఇటీవల ఈజిల్లాలో మంత్రిగా పనిచేసిన వ్యక్తి పోలీసుల బట్టలు ఊడదిస్తానని చెప్పడం దారుణమన్నారు. వారికి కుటుంబాలు ఉన్నాయని, వారిని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ గంటి హరీష్‌మాదూర్ మాట్లాడుతూ కోనసీమ రైల్వేలైన్‌కు అడ్డంకులు తొలగి పోయాయని, త్వరలోనే నాన్నగారి కల సాకారం కానుందన్నారు. గోదావరి తీర ప్రాంతంలో వ్యవసాయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, గ్రోయిన్స్ నిర్మాణానికి జిల్లావ్యాప్తంగా రూ.1000 కోట్లు అవసరం ఉంటుందన్నారు. రాబోయే పార్లమెంటు సమావేశంలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. అనంతరం స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌సీ పేరాబత్తుల రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, మోకా ఆనంద సాగర్, సత్తిబాబు రాజు, బొంతు పెదబాబు, సంసాని పెద్దిరాజు, నక్కా సునీల్, గణపతి వీరరాఘవులు, ఆరుమిల్లి లాల్‌బాబు, గుడాల వెంకటరమణ, శేరు శ్రీనుబాబు, గుత్తుల రామకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పరుగులు

రాజోలు, జూలై 17(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతోందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. గురువారం రాజోలులో నాగార్జున స్ట్రీట్‌లో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. తల్లికి వందనం పథకంలో ఇంట్లో ఉన్న పిల్లలందరికీ నగదు జమ చేశామన్నారు. ఈనెలలోనే అన్నదాత సుఖీభవ నగదు రైతుల ఖాతాలో జమ చేస్తామన్నారు. వచ్చేనెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలవుతుందని పేర్కొన్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రేయింబవళ్లు కష్టపడుతున్నారన్నారు. పార్టీకి కార్యకర్తలే బలమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, గోదావరి సెంట్రల్ ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అహర్నిశలు శ్రమిస్తున్న చంద్రబాబు

అమలాపురం రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాలో బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా అర్హులైన ప్రతీ నిరుపేదకు ప్రభుత్వ లబ్ధి చేకూర్చేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పేరూరులో గురువారం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళితో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని మై టీడీపీ యాప్‌లో నమోదు చేయించారు. అనంతరం సాకుర్రులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా, మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, మంద గెద్దయ్య, పోలమూరి ధర్మపాల్, అధికారి బాబ్జి, ముత్తాబత్తుల రమణ, చొల్లంగి అప్పాజీ, రాజులపూడి బీముడు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే దాట్ల


పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారానికి హాజరైన ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ముమ్మిడివరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. కొమానపల్లి వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత వార్షిక బడ్జెట్‌లో రూ.48,341.14 కోట్లు కేటాయించి రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తామన్నారు. కొమనాపల్లి వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా పొద్దోకు నారాయణరావు(బాలు), సభ్యులుగా కేశప్రగడ సూర్యనారాయణమూర్తి, గుద్దటి పట్టాభిరామయ్య ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, సాగి సూరిబాబురాజు, దాట్ల పృథ్వీరాజ్, గ్రామ సర్పంచ్ కాశి ఇందిర, కాశి రామకృష్ణ, గుద్దటి జమ్మి, దూడల స్వామినాయుడు, గుద్దటి వీరాస్వామినాయుడు, కుంచనపల్లి వెంకన్నబాబు, కుంచనపల్లి నారాయణ, షేక్ సుభాన్, మెండా జగన్నాథం, పాము చిట్టిబాబు, ముమ్మిడివరపు వరలక్ష్మి, మహాదశ లక్ష్మీనారాయణ, కుంచనపల్లి భీమేశ్వరరావు, డీసీసీబీ మేనేజర్ వై.సత్యనారాయణ, సీఈవో మణికంఠ, కంపసత్తి చిన్ని, కోన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కంపెనీలు సరఫరా చేయకుండా ఆయిల్ విక్రయాలు ఎలా!

ఉప్పలగుప్తంలో బంకు నిర్వహణపై జేసీకి డీలర్లు ఫిర్యాదు

అమలాపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆయిల్ కంపెనీల నుంచి సరఫరా చేయకుండానే కన్స్యూమర్ బంకు పేరుతో వేలాది లీటర్ల పెట్రోల్, డీజిల్ ఎలా సరఫరా చేస్తున్నారో పరిశీలించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆయిల్ బంకుల డీలర్ల అసోసియేషన్ గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి అభ్యర్థించింది. తక్షణమే దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బంకుల యజమానులు కోరారు. ఉప్పలగుప్తంలో పోలీసుస్టేషన్, రెవెన్యూ కార్యాలయానికి ఎదురుగా కన్స్యూమర్ పేరుతో ఒక బంకును ఏర్పాటుచేశారు. కొంత కాలం నుంచి ఐవోసీ కంపెనీ పేరుతో భారీగా ఆయిల్ విక్రయాలు చేపట్టారని అయితే తమకు అనుమానం వచ్చి ముంబైలోని ఐవోసీ కంపెనీ ప్రతినిధులను సంప్రదించగా ఆ బంకుకు ఐవోసీ కంపెనీతో ఎటువంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. 2021లోనే అవకతవకలు ఉండడం వల్ల లైసెన్సును రద్దు చేశారని ప్రతినిధులు తెలిపారు. ఆ రోజు నుంచి ఈరోజు వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. అయితే కొందరు ఉద్యోగులతో కుమ్మక్కై కొత్త విధానం ఇక్కడ అమలులోకి తీసుకువచ్చారు. నయారా కంపెనీ పేరుతో ఇటీవలే ఆ కన్స్యూమర్ బంకుకు స్కిక్కర్లు మార్చి పాండిచ్చేరి యానాం నుంచి ఆయిల్ తీసుకువచ్చి విక్రయాలు చేస్తున్న విషయాన్ని డీలర్లంతా హోంమంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆమెస్పందించి జిల్లా ఎస్పీని ఆదేశించి యానాం నుంచి వచ్చే ఆయిల్ నిరోధానికి చెక్‌పోస్టు ఏర్పాటుచేయాలని చేసిన సూచనపై ఎస్పీ చెక్‌పోస్టును ఏర్పాటుచేశారు. అయినప్పటికీ నేరుగా ట్యాంకర్లతోనే ఇక్కడకు రవాణా అవుతుందని, దీని వెనుక పోలీసు, రెవెన్యూ అధికారులు ప్రముఖంగా పనిచేస్తున్నారని డీలర్లు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈమేరకు వినతిపత్రాన్ని కూడా ఆమెకు అందజేశారు. అయితే ఈబంకుకు తన నుంచి ఎటువంటి అనుమతులులేవవిరెవెన్యూ అధికారులు స్పష్టం చేస్తునప్పటికీ జాయింట్ కలెక్టర్ సూచనపై గురువారం ఉప్పలగుప్తం తహశీల్దార్‌కు బంకులో జరుగుతున్న వ్యవహారాలపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లామని, ఎమ్మార్వో స్పందించిన తీరుపై వారు అసంతృప్తి వ్యక్తంచేస్తూ డీలర్ల అసోసియేషన్ నిరసన తెలిపింది.

అనుమతులు లేకుండా తవ్వకాలు



పి.గన్నవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): లంకలగన్నవరం గ్రామదేవత శ్రీమహాలక్ష్మీ అమ్మవారి దేవాలయం వెనుక భాగంలో వశిష్టనది పాయ వెంబడి కొంతమంది మాఫియా పెద్దలు అక్రమంగా ఇసుక తవ్వకాలను మొదలుపెట్టారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి సరిహద్దు ప్రాంతంలో నదిలో మునిగి ఇసుకను వెలికితీసి పడవల ద్వారా ఒడ్డుకు తెస్తున్నారు. కనీస అనుమతులు లేకుండా నదీపాయలో ఇసుకను తవ్వకాలు జరపడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈర్యాంపు వల్ల వరదల సమయంలో సమీప పంట పొలాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అనుమతులు లేకుండా మండలంలోని పలుచోట్ల ఇసుకను భారీగా నిల్వ చేశారని అధికారులు వాటిపై కన్నెత్తి చూడటం లేదని తీవ్రస్థాయిలో విమర్శలు నడుస్తున్నాయి.

అనుమతులు లేవు: తహశీల్దార్

మండలంలోని పడవల ద్వారా, స్వయంగా ఇసుక, మట్టి తవ్వకాలు జరపడాటనికి ఏవిధమైన అనుమతులు లేవని తహశీల్దార్ పి.శ్రీపల్లవి అన్నారు.. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవన్నారు.

గ్రోయిన్స్ పనులు పూర్తిచేయాలి

ఐ.పోలవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): గోదావరి నదీకోత నివారణకు చేపట్టిన గ్రోయిన్స్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అధికారులకు సూచించారు. ఎదుర్లంక వద్ద రూ.79.76కోట్లతో జరుగుతున్న గ్రోయిన్స్ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. హెడ్‌వర్క్స్ ఏఈ ఈశ్వర మన్యంను పనుల పురోగతిపై వివరాలు అడిగారు. కార్యక్రమంలో నాగిడి నాగిడి నాగేశ్వరరావు, సాగిరాజు సూరిబాబు రాజు, ముదునూరి రామలింగరాజు, సాగి వాసురాజు, అల్లూరి వెంకన్నబాబురాజు, జనిపెల్ల గిరి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు


అంబాజీపేటలో బాధ్యతలు స్వీకరించిన ఏఎంసీ పాలకవర్గం

- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ
- మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

అంబాజీపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమాభివృద్ధికి కూటమిప్రభుత్వం ఎనలేని కృషిచేస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చిట్టూరి శ్రీనివాస్, వైస్‌చైర్మన్‌గా కొర్లపాటి వెంకటేశ్వరరావు, గౌరవ చైర్మన్‌గా గిడ్డి సత్యనారాయణ, పాలకవర్గసభ్యులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ కమిటీల ద్వారా రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని ఎమ్మెల్యే, కూటమి నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సివిల్‌సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ మోకా ఆనందసాగర్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, నీటిపారుదల కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, గణపతి వీరరాఘవులు, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, నేదునూరి పెద్దిరాజు, కొప్పినీడి ఈశ్వరరావు, పాలకవర్గ సభ్యులు అడబాల సూర్యావతి అంబటి గంగాభవాని, కముజు నాగసత్య, కోసూరి పోచమ్మ, మట్టపర్తి సోమేశ్వరరావు, మేడిశెట్టి మంగతాయారు. మోర్త వీరవెంకటసత్యనారాయణ, నేదునూరి కుమారి, సలాది ప్రసాద్, గంధం వెంకటేశ్వరరావు, వక్కపట్ల ఆదిలక్ష్మి, దుర్గా శ్రీనివాసరావు, కుడుపూడి సత్యవేణి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ ఐదో తరం వారసుడు భీమ కామేశ్వరరావు మృతి

-నివాళులర్పించిన ఎమ్మెల్యే గిడ్డి, నాయకులు



పి.గన్నవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల అన్నపూర్ణగా ప్రసిద్ధి గాంచిన డొక్కా సీతమ్మ ఐదో తరం వారసుడు అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ డొక్కా భీమకామేశ్వరరావు(59) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. సీతమ్మ వంశీయులు ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడినప్పటికీ భీమ కామేశ్వరరావు సీతమ్మ నివాసాన్ని కాపాడుకుంటూ తన కుటుంబంతో స్వగ్రామం లంకలగన్నవరంలోనే నివాసం ఉన్నారు. సీతమ్మ నివాసాన్ని సందర్శించడానికి వచ్చే సందర్శకులు, అధికారులకు సీతమ్మ చరిత్రను వివరించేవారు. అనారోగ్యానికి గురైన ఆయన కాకినాడలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు లంకలగన్నవరంలో భీమకామేశ్వరరావు మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుమారులు గోపి, వాసు, భార్య లక్ష్మిలనుఓదార్చారు.

పంచాంగకర్తలు ఉపద్రష్ట సోదరులకు సన్మానం




అమలాపురం టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): అఖిలభారత బ్రాహ్మణ మహా సంఘ్ ఆధ్వర్యంలో పంచాంగకర్తల సదస్సు నర్సారావుపేటలో మూడు రోజుల పేటలో నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీవరాహమిహిర శిష్య బృందం ఆధ్వర్యంలో అమలాపురానికి చెందిన ప్రముఖ పంచాంగకర్తలు ఉపద్రష్ట నాగాదిత్యన్ సోదరులను అఖిలభారతీయ బ్రాహ్మణ మహాసంఘం జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ గౌరవరం సుబ్రహ్మణ్యశర్మ దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఉపద్రష్ట సోదరులు చేస్తున్నసామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. బ్రహ్మశ్రీ బొర్రా శ్రీవెంకటేశ్వరశర్మ అవధాని సిద్ధాంతినిసత్కరించారు. ఉపద్రష్ట సోదరులైన నాగార్జున్, విమలాదిత్యన్, విక్రమాదిత్యన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. పంచాంగాన్ని ఏకీకృతం చేసేలక్ష్యంతో సదస్సు నిర్వహించినట్లు నాగాదిత్యన్ తెలిపారు.

మళ్లీ వాయిదా పడిన ఎంపీపీ ఎన్నిక

రాజోలు, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాజోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎన్నిక గురువారం మరోసారి వాయిదా పడింది. రాజోలు మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడి స్థానం ఖాళీ ఏర్పడినందున రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంపీపీ ఎన్నిక కోసం రాజోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఎంపీపీ స్థానానికి కోరం లేక అధ్యక్షుడి ఎన్నిక ఈనెల16న నిర్వహించగా 17కు వాయిదా వేశారు. 17న కూడా కోరం సరిపడగా ఎంపీటీసీలు హాజరు కాలేదు. జనసేన పార్టీకి చెందిన ఇద్దరు. ఇండిపెండెంట్ ఒక ఎంపీటీసీ హాజరుకాగా కోరం లేకపోవడంతో నిలిచిపోయిందని ఎన్నికల అబ్జర్వర్ పీఎస్ఎస్ రాజకుమారి గురువారం తెలిపారు. తదుపరి ఆదేశాల కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారిగా పి.బొజ్జిరాజు వ్యవహరించారు.

వారసత్వ సంపద పరిరక్షణకు కృషి అభినందనీయం

- సత్తిపండుకు సీఎం చంద్రబాబునాయుడు లేఖ



యానాం, జూలై17(ఆంధ్రజ్యోతి): గుండి సూదితో అద్దాలపై బొమ్మలు గీసి ప్రముఖులకు బహుమతులుగా పంపించే యానానికి చెందిన తాళ్ల వ్యాపారి గ్రంధి సత్యనారాయణ (సత్తిపండు)కు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందన లేఖ పంపించారు. ఇటీవల జరిగిన బుద్ధ జయంతి, అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగా అద్దంపై చెక్కిన బుద్ధిడి కళాకృతిని బహుమతిగా సీఎం చంద్రబాబుకు పంపారు. బహుమతి అదుకోవడం అనందంగా ఉందని చంద్రబాబు సత్తిపండుకు లేఖ పంపారు. ఇటువంటి ప్రత్యేకమైన కళాఖండం ద్వారా మన సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని సంరక్షించి ప్రోత్సహించడంలో మీ అంకిత భావం ప్రశంసనీయమని చంద్రబాబు అన్నారు. సత్యనారాయణ మూడు దశాబ్దాల నుంచి దేశంలోని ఎందరో ప్రముఖులకు బొమ్మలు పంపించి వారి నుంచి అభినందన లేఖలు అందుకున్నారు. తాను పంపిన బహుమతిని గుర్తుపెట్టుకుని సీఎం చంద్రబాబు స్పందించడం సంతోషంగాఉందని సత్తిపండు అన్నారు.

ఘనంగా రమణయ్య జయంతి

ముమ్మిడివరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): రిపబ్లికన్ పార్టీ మాజీ శాసనసభ్యుడు బీవీ రమణయ్య జయంతిని ముమ్మిడివరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆర్పీఐ నాయకుడు చీకురుమెల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలమ్మ చెరువుగట్టున ఉన్న బుద్ధపార్కు ఆవరణలో రమణయ్య విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఎం రుషి మాట్లాడుతూ బీవీ రమణయ్య అల్లవరం నియోజకవర్గం నుంచి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రజా సమస్యలపై పోరాటం సాగించి వాటి పరిష్కారానికి విశేష కృషి చేశారన్నారు. బళ్ల సత్యనారాయణ, మోకా బాలయోగి, జనిపల్లి సత్యనారాయణ, డి.ఆంజనేయులు, నరసింహమూర్తి, వై.బాలరాజు, జనార్ధన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో న్యూఫీడర్ ఆర్డీఎస్ఎస్ పనులు జరుగుతున్న కారణంగా ఉదయం శుక్రవారం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. ఉప్పలగుప్తం, పేరాయిచెరువు, జగ్గరాజుపేట, గొల్లవిల్లి, వాడపర్రు, కూనవరం, కిత్తనచెరువు, చీకట్లపాలెం, సన్నవిల్లి, సూదాపాలెం, భట్టుపాలెం, నంగవరం, భీమనపల్లి, సింగరాయపాలెం, విలసవిల్లి, మునిపల్లి, పెదగాడవిల్లి, చినగాడవిల్లి, వానపల్లిపాలెం, ఎస్.కొత్తపల్లి, రాఘవులపేట గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. టి.చల్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 33కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 9నుంచి 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. టి.చల్లపల్లి, గోపవరం, సరిపల్లి, ఎస్.యానాం, వాసాలతిప్ప, అల్లవరం మండలంలోని నక్కా.రామేశ్వరం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రులో కొత్తసబ్‌స్టేషన్ నిర్మాణంలో భాగంగా శుక్రవారం పల్లంకుర్రు, బలుసుతిప్ప, ఏబీఏంసీ 11కేవీ ఫీడర్లకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ కె.రాంబాబు తెలిపారు. ఉదయం 9నుంచి 5గంటలవరకు బలుసుతిప్ప, కొప్పిగుంట, పల్లంకుర్రు,కందికుప్ప, నడవపల్లి, గెద్దనపల్లి, దొంతికుర్రుగ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

పొట్టి శ్రీరాములు ట్రస్టుకు స్థలం కేటాయింపుపై హర్షం

ఉప్పలగుప్తం, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టుకు 6.80ఎకరాల స్థలం కేటాయింపుపై రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం హర్షం వ్యక్తం చేశారు. గురువారం భీమనపల్లిలో జరిగిన ఆర్యవైశ్య సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు స్థలం కేటాయించి, 58అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం, స్మృతివనం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతించారు. దీనికి కృషిచేసిన రాష్ట్ర చైర్మన్ డూండి రాకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం ఆమోదించారు. సమావేశంలో వరదా శ్రీరామచంద్రమూర్తి, కంకటాల సురేష్, మునికోటి శ్రీనివాస్, కంకటాల రమణ, మునికోటి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా సాగుపై శిక్షణ

మలికిపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎంపెడ శిక్షణ కార్యక్రమంలో గురువారం రైతులకు సముద్ర ఉత్పత్తులు, ఆక్వారంగం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, మేత, రోగ నిర్ధారణ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపెడ జేటీవో బంగారమ్మ, సర్పంచ్ రాపాక ఆనంద్‌కుమార్, పి.సునీల్‌కుమార్, నూకేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మరిన్ని సేవలందించాలి


ఎదుర్లంక సొసైటీ చైర్మన్ సత్యనారాయణరాజు ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): సొసైటీల ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందేలా పాలకవర్గాలు పని చేయాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. గురువారం ఆయన ఎదుర్లంక, తిల్లకుప్ప, కొమరగిరి సొసైటీ పాలకవర్గాల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఎదుర్లంక సొసైటీ చైర్మన్‌గా ముదునూరి సత్యనారాయణరాజు(శ్రీనురాజు), సభ్యులుగా పేరాబత్తుల వెంకటరమణ, గంజా వెంకటరమణ ప్రమాణస్వీకారం చేశారు. తిల్లకుప్ప సొసైటీ చైర్మన్‌గా కడియం వెంకటేశ్వరరావు, సభ్యులుగా శీలం సత్యనారాయణ, లంక రాంబాబు, కొమరగిరి సొసైటీ చైర్మన్‌గా కడియం పెన్మెత్స వెంకటరాజు, సభ్యులుగా కోలా రామారావు, వాసంశెట్టి సోమేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, జడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, నాయకులు ముదునూరి రామలింగరాజు, సాగిరాజు సూరిబాబురాజు, దాట్ల పృధ్వీరాజు, కాకర్లపూడి రాజేష్, లంకలపల్లి బుల్లియ్య, సాగిరాజు వాసురాజు, గాదిరాజు బుచ్చికృష్ణంరాజు, సాకా సీతాదేవి, ఆకుల సత్తిబాబు, సాధనాల త్రిమూర్తులు, పెంట రవిప్రసాద్, పెన్మెత్స శేఖర్, పెన్మెత్స కిశోర్ పాల్గొన్నారు.

'అణచివేతకు గురవుతున్న బలహీనవర్గాలు'

మామిడికుదురు, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనార్టీలు తీవ్ర అణచివేతకు గురవుతున్నారని బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ ఆరోపించారు. అప్పనపల్లిలో శ్రీయశోధ కృష్ణ యాదవ సంఘ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 80నుంచి 85శాతం ఉన్న బలహీనవర్గాల ప్రజలు అణచివేతకు గురవుతున్నారని, అందువల్ల ప్రజల్లో మార్పు రావాలి, రాజకీయం మారాలి, ప్రజా రాజకీయం రావాలనే లక్ష్యంతో భారత చైతన్య యువజన పార్టీని స్థాపించామన్నారు. పార్టీ త్వరలో రాష్ట్రమంతా విస్తరించడానికి కార్యాచరణ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శెట్టిమేను ఏడుకొండలు, నాగళ్ల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి

మామిడికుదురు, జూలై 17(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం వెంటనే 15వ ఆర్థిక సంఘం విడుదల చేయాలని సర్పంచ్‌ల సమాఖ్య మండల సమావేశం కోరింది. పాశర్లపూడి పంచాయతీ వద్ద సర్పంచ్‌ల సమాఖ్య సమావేశంలో అధ్యక్షురాలు జాలెం రమణకుమారి అధ్యక్షతన గురువారం జరిగింది. పంచాయతీల్లో పారిశుధ్య పనులు నిర్వహించడానికి కూడా కనీస నిధులు లేవన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు సక్రమంగా వేసేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు కోరారు. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మోటారుసైకిల్ చోరీ

ముమ్మిడివరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ క్రాపచింతలపూడికి చెందిన పాయసం సత్యప్రసాద్ తన ఇంటి ఆవరణలో ఉంచిన మోటారుసైకిల్ బుధవారం రాత్రి అపహరణకు గురైంది. ఆ ఇంటికి ఉన్న సీసీ కెమెరాలో మోటార్‌సైకిల్ అపహరణ దృశ్యం రికార్డు అయింది. ముమ్మిడివరం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

సుపరిపాలనలో తొలి అడుగు

అంతర్వేది, జూలై 17(ఆంధ్రజ్యోతి): వీవీమెరక, అంతర్వేది దేవస్థానం, కేశవదాసుపాలెం, గొంది, రామేశ్వరం తదితర గ్రామాల్లో ఆయా గ్రామశాఖల అధ్యక్షతన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమం అభివృద్ధితో తొలి ఏడాది పూర్తిచేసుకుని ప్రజలకు మరిన్ని సంక్షేమ ఫలాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని నాయకులు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మణేశ్వర సహకార సొసైటీని అభివృద్ధి చేస్తా : దాట్ల


కొమరగిరిపట్నం సొసైటీ చైర్మన్ కృష్ణంరాజును సన్మానించిన జనసేన, టీడీపీ నాయకులు

అల్లవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా, వ్యాపారపరంగా కొమరగిరిపట్నం లక్ష్మణేశ్వర సహకార సొసైటీని అభివృద్ధి చేస్తానని సొసైటీ అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు అన్నారు. కొమరగిరిపట్నం క్షత్రియ సేవాభవన్‌లో త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా దాట్ల కృష్ణంరాజు, డైరెక్టర్లగా పిండి సత్యనారాయణ, కొప్పిశెట్టి వీరరాఘవులు ప్రమాణస్వీకారం చేశారు. చైర్మన్ దాట్ల కృష్ణంరాజు, డైరెక్టర్లను జనసేన, టీడీపీ నాయకులతో పాటు గ్రామస్తులు దుశ్శాలువాలు కప్పి సన్మానించారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, కల్వకొలను తాతాజీ, లింగోలు పండు, నల్లా రాము, మంతెన సురేష్‌రాజు, దాట్ల గోపీరాజు, పిండి గణపయ్య, గునిశెట్టి చినబాబు, కొప్పుల నాగమానస, కంకిపాటి వీరబాబు, మేడిద శంకరరావు, పరసా కిరణ్, ఆచంట నాగరాజు, లింగం శ్రీనివాస్, గుర్రం కృష్ణ, కటికిరెడ్డి బాబి, కొమ్మూరి సత్తిబాబు, దాట్ల శ్రీహరిరాజు, నార్ని సత్యనారాయణ, వేగిరాజు వెంకట్రాజు, కంకిపాటి గోపి, కొమ్మూరి సత్తిబాబు, మంతెన సత్యనారాయనరాజు, గుర్రం కృష్ణతో పాటు జనసేన, టీడీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్, బాలయోగికి నివాళి

మలికిపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దిండి వై.జంక్షన్‌లో గల ఎన్టీఆర్, బాలయోగి విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈప్రాంత అభివృద్ధికి బాలయోగి, రాష్ట్రాభివృద్ధికి ఎన్టీఆర్ చేసిన కృషిని ఈసందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో దిండి సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

పాలకవర్గం రైతు ప్రయోజనాలను కాపాడాలి


కంఠంశెట్టి సత్యప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

● కొత్తపేట ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార పరపతి సంఘాల కమిటీలు రైతు ప్రయోజనాలను కాపాడేలా పనిచేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. గురువారం కొత్తపేట రూరల్ బ్యాంకు త్రిమేన్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన మహోత్సవానికి ముఖ్యఅతిథులుగా వారు హాజరయ్యారు. త్రిమేన్ కమిటీలో అధ్యక్షుడిగా జనసేన పార్టీకి చెందిన కంఠంశెట్టి సత్యప్రసాద్(చంటి), బీజేపీకి చెందిన పాలూరి జయప్రకాశ్‌నారాయణ, జనసేనకు చెందిన వాసంశెట్టి సత్యనారాయణ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, బూసి భాస్కరరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, ఉపసర్పంచ్ విశ్ల మారుతీప్రసాద్, ముత్యాల బాబ్జి, యల్లమల్లి జగన్మోహన్, గనిశెట్టి వీరేష్, మిద్దే ఆదినారాయణ, పల్లికొండ సుధీర్‌కుమార్, సలాది రామకృష్ణ, చోడపనీడి ఉమ, చిక్కం శివాజీనాయుడు, సంపతి కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు మంచి సేవలు అందించాలి'


చోడవరంలో కమిటీ చైర్మన్‌కు నియామక పత్రం అందజేస్తున్న సత్యం

ద్రాక్షారామ, జూలై 17(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల త్రిసభ్య కమిటీ చైర్మన్లు, సభ్యులు రైతులకు సంఘాల ద్వారా మంచి సేవలు అందించాలని టీడీపీ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. గురువారం రామచంద్రపురం మండలం చోడవరం, ఉండూరు పీఏసీసీఎస్‌ల త్రిసభ్య కమిటీల ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన పాల్గొన్నారు. చోడవరం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా నూనె లక్ష్మయ్య, సభ్యులుగా రెడ్డి వీర్రాఘవులు, చాటికల రామదాసులు ప్రమాణస్వీకారం చేసిన అనంతరం నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పీఏసీసీఎస్ సీఈవో పిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఉండూరు పీఏసీసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా మేడిశెట్టి రాధాకృష్ణమూర్తి, సభ్యులుగా చోడిశెట్టి వీరభద్రరావు, రాయుడు లోవప్రసాద్‌లు ప్రమాణస్వీకారం చేశారు. టీడీ పీ నాయకులు చిగురుపాటి సాయి, జెడ్పీమాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, హసన్‌బాద ఎంపీటీసీ వై.దేవి, టీడీపీ బీసీ సెల్ నాయకుడు పెంకే సాంబశివరావు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండి సేవలందించండి


ప్రమాణస్వీకారోత్సవ సభలో మాట్లాడుతున్న సత్యం

కె.గంగవరం, జూలై17(ఆంధ్రజ్యోతి): సొసైటీ పాలకవర్గ సభ్యులుగా ఎన్నికైన వారు రైతులకు అందుబాటులో ఉండి సహకార వ్యవస్థను బలోపేతం చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. గురువారం కె.గంగవరం వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారానికి ఆయన హాజరై ప్రసంగించారు. చైర్మన్‌గా నేమాని సత్యనారాయణ(పిండికొట్టు సత్తిబాబు), సభ్యులుగా గంగాపాత్రుల కాశీవిశ్వనాధ్, అల్లూరి శ్రీనివాస్ చౌధరిలు ప్రమాణస్వీకారం చేశారు. చైర్మన్ నేమాని సత్యనారాయణ మాట్లాడుతూ కె.గంగవరం సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నెక్కంటి బాలకృష్ణ, నేమాని సత్యనారాయణమూర్తి, చిర్రా రాజ్‌కుమార్, జగతా రమణ, గన్ని శ్రీనివాసు, తాడాల రాంబాబు, భాను పాల్గొన్నారు.

పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం


పాలకవర్గం ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

ఆలమూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆలమూరు బొబ్బా చినవీరన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం గురువారం జరిగింది. పాలకవర్గ అధ్యక్షుడిగా వంటిపల్లి వీర వెంకట సతీష్‌కుమార్, సభ్యులుగా రామానుజుల కళ్యాణ సూర్యప్రకాష్, గుడాల నాగవెంకట్రావులు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన సతీష్‌కుమార్‌ను పలువురు కూటమి నాయకులు, అధికారులుసత్కరించి అభినందించారు.

వెదురుపాక సొసైటీ త్రిసభ్యకమిటీ చైర్మన్‌గా గణేష్


పిల్లి గణేష్

రాయవరం, జూలై17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక వారాహి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా మండలంలోని వి.సావరం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పిల్లి గణేష్‌ను నియమించినట్లు గురువారం గణేష్ తెలిపారు. వి.సావరంలో ఆయన మాట్లాడుతూ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా తాను, సభ్యులుగా రాయవరం గ్రామానికి చెందిన నల్లమిల్లి రాజేష్‌రెడ్డి, నదురుబాద గ్రామానికి చెందిన తేగల గోపి నియమించినట్లు చెప్పారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు గణేష్ కృతజ్ఞతలు తెలిపారు.

బీటలువారిన వరి పొలాలు


ఆలమూరు మండలం గుమ్మిలేరు వద్ద నీరు లేక ఎండిపోతున్న వరినాట్లు

● ఎండిపోతున్న నాట్లు

● ట్రాన్స్‌ఫార్మర్ వేయండి

● నాట్లు రక్షించండి!

● సాగునీరందక రైతుల ఇక్కట్లు

కె.గంగవరం, జూలై17(ఆంధ్రజ్యోతి): మండలంలోని యండగండి గ్రామంలో బోర్లు ఆధారంగా సాగు చేస్తున్న 20 ఎకరాల పొలాల్లో నాట్లు ఎండిపోతున్నాయి. గ్రామంలో టేకి డ్రైన్ పరివాహక ప్రాంతంలో మోటార్ల సహాయంతో సాగు చేస్తుంటారు. టేకి డ్రైన్ నుంచి నీరు తోడుకునేందుకు విద్యుత్‌శాఖ నుంచి కనెక్షన్‌లు ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఈ టేకి డ్రైన్ పరిసర ప్రాంతంలో ఒక ట్రాన్స్‌ఫార్మర్ నెలరోజుల క్రితం పాడైపోయింది. అప్పటి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అప్పటికే నాట్లు వేసుకున్న రైతులు పొలాల ప్రస్తుతం నీరు లేకపోవడంతో ఎండిపోతున్నాయి. సమస్య తీవ్రంగాఉందని నష్టపోతున్నామని రైతులు విద్యుత్‌శాఖ అధికారులకు మొరపెట్టుకున్నా ట్రాన్స్ ఫార్మర్ వేయడంలేదని వాపోతున్నారు. ఒక ప్రక్క తీవ్ర వర్షాభావంతో, ఎండలు మండుతుండటంతో నాట్లు పూర్తిగా పాడైపోయాయని, పొలాలు బీటలు బారుతున్నాయని రైతులు వాపోతున్నారు. పాడైపోయిన ట్రాన్స్ ఫార్మర్ స్థానంలో కొత్తట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసి తమ పొలాల్లో నాట్లను రక్షించాలని రైతులు కోరుతున్నారు.

శివారు భూములకు అందని నీరు

ఆలమూరు, జూలై17(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం గుమ్మిలేరు వద్ద చొప్పెల్ల కాలువ శివారు భూములకు సాగునీరు అందక సార్వా వరినాట్లు ఎండిపోతున్నాయి. జూలై నెలలో అధిక వర్షాలతో ముంపునకు గురికావాల్సిన కాలంలో పంట భూములకు నీరులేక ఎండిపోతున్న దృశ్యం మునుపెన్నడు చూడలేదని రైతులు వాపోతున్నారు. చొప్పెల్ల లాకులవద్ద నుంచి చొప్పెల్ల నర్సిపూడి, మోదుకూరు, గుమ్మిలేరుతోపాటు మండపేట భూములకు సాగునీరు ఈ పంటకాలువ ద్వారా సాగునీరు అందాల్సి ఉంది. అయితే ఈఏడాది అధిక ఎండలతోపాటు వర్షాలు లేకపోవడంతో సాగునీరు కాలువ చివర భూములకు నీరుచేరక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాట్లు వేసిన పంట భూమికి నీరు సక్రమంగా చేరకపోతే నాట్లు ఎండిపోయి పూర్తిగా దెబ్బతింటాయని ఇప్పటికైనా రైతుల ఇబ్బందులను గుర్తించి కాలువ చివర భూములకు సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



యండగండిలో బీటలుబారిన వరి పొలం, ట్రాన్స్‌ఫార్మర్ తొలగించడంతో బోడిగా ఉన్న విద్యుత్ స్తంభం

ఇసుక అక్రమ రవాణా జరుగకుండా చూడాలి

● రామచంద్రపురం ఆర్డీవో అఖిల


తాతపూడి ఇసుకనిల్వకేంద్రం వద్ద రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల

కపిలేశ్వరపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఇసుకనిల్వ కేంద్రాలవద్ద ఎలాంటి అక్రమ ఇసుక రవాణా జరుగకుండా చూడాలని రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల ఇసుకనిల్వ కేంద్రం ఇన్‌చార్జ్‌లను ఆదేశించారు. గురువారం మండలంలోని కపిలేశ్వరపురం, తాతపూడి ఇసుక నిల్వ కేంద్రాలను, మూసివేసిన శ్రీరాంపురం ఇసుక ర్యాంపును ఆమె తహసీల్దార్ జి.శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బందితో కలిసి తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె ఇసుక నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఇసుక లోడు వాహనాలకు బిల్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అనంతరం కపిలేశ్వరపురం, కోరుమిల్లి గ్రామాల్లో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల లే అవుట్‌లను, టేకి సచివాలయంలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్, గ్రామకార్యదర్శి కె.శివచక్రవర్తి, అంగర ఏఎస్ఐఆర్. సత్యనారాయణ, వీఆర్‌వోలు వి.రామకృష్ణ, ఎస్.సత్యనారాయణ, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ద్వారపూడిలో గ్రావెల్ తవ్వకాలపై సర్వే

మండపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం ద్వారపూడి శివారు వేములపల్లిలో సర్వే నెం.328లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామానికి చెందిన స్థానికులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో వేములపల్లిలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావు ఆదేశాల మేరకు మండపేట మండల సర్వేయర్, ఆర్ఐ, వీఆర్‌వో, రెవెన్యూ సిబ్బంది గురువారం గ్రావెల్ తవ్వకాలు జరిగిన ప్రదేశంలో సర్వే నిర్వహించారు. తమ విచారణలో అక్రమ తవ్వకం జరిగినట్టు గుర్తించామని తహసీల్దార్ తేజేశ్వరరావు తెలిపారు. సర్వేలో వెల్లడైన విషయాలను జిల్లా మైనింగ్‌శాఖ అధికారికి నివేదికను పంపించామని తహసీల్దార్ తెలిపారు.

జాబ్‌మేళాలో 51 మంది ఎంపిక

కొత్తపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వికాస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో సుమారు 12 కంపెనీలు పాల్గొన్నాయి. వివిధ అర్హతలు ఉన్న 146 మంది అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనగా వివిధ కంపెనీలు 51 మందిని ఎంపిక చేసుకుని నియామకపు పత్రాలు అందించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రాజు తెలిపారు. మరో 29 మంది అభ్యర్థులు ఎంపికయ్యారన్నారు. వైస్ ప్రిన్సిపల్ టి.రమాదేవి, డి.హరిశేషు, జి.రమేష్, పి.ప్రేమ్‌కుమార్, డాక్టర్ జి.శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

రామచంద్రపురం(ద్రాక్షారామ),జూలై17 (ఆంధ్రజ్యోతి)రామచంద్రపురంలో ఉపాధి కార్యాలయంలో ఈనెల 19న ప్రైవేటు బ్యాంకుల్లో పలు నియామకాలకు సంబంధించి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి సుభాష్ కార్యాలయం ప్రకటనలో పేర్కొంది. ఐసీఐసీఐ బ్యాంకు, టైంప్రో ద్వారా యాక్సీబ్యాంకుల్లో నియామకాలు జరుగుతాయని నిరుద్యోగులు వినియోగించుకోవాలని కోరారు.

బీసీ రక్షణ చట్టం తీసుకురాకపోతే ఉద్యమిస్తాం

● బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్

రావులపాలెం, జూలై17(ఆంధ్రజ్యోతి): బీసీలకు అన్నివిధాలా రక్షణ కల్పించే విధంగా చట్టాన్ని తీసుకురాకపోతే ఉద్య మిస్తామంటూ బీసీ వై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ అ న్నారు. రావులపాలెం సీఆర్సీ మీటింగ్ హాలులో మట్టా వీరబాబుగౌడ్ ఆధ్వర్యంలో కొత్తపేట నియోజకవర్గ బీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షు డు బోడే రామచంద్రయాదవ్ పాల్గొన్నారు. ముందుగా ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ, వైసీపీ పార్టీలు రాజ్యమేలుతున్నాయి. రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలి, మహిళలకు, రైతులకు ఏ విధంగా మేలు చేకూర్చాలి, అనే అంశాలు కాకుండా రాష్ట్రాన్ని ఏ విధంగా దోచుకోవాలనే అనే అంశంపైనే చూస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు కావస్తున్న మహిళలకు, రైతులకు బీసీలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదన్నారు. ఈనెల 23వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పూర్తి ప్రణాళిక రూపొందిస్తామని ఆయన అన్నారు.


రావులపాలెంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆలమూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆలమూరు, చొప్పెల్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడుతుందని ట్రాన్స్‌కో ఈఈ రత్నాలరావు తెలిపారు. ఆలమూరు, చొప్పెల్ల సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఆలమూరు, కొత్తూరు, చింతలూరు, పెదపళ్ల, సంధిపూడి, గుమ్మిలేరు, మోదుకూరు, నర్సిపూడి, మూలస్థానం, జొన్నాడ గ్రామాలలో విద్యుత్‌లైన్లు మరమ్మతులు కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కపిలేశ్వరపురం : మండలంలోని అంగర సబ్‌స్టేషన్ పరిధిలోని అంగర, వల్లూరు, కపిలేశ్వరపురం, పడమరఖండ్రిక, వెదురుమూడి, టేకి, మాచరమట్లలు, శ్రీరామపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం గం9 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు ఓ ప్రకటనలో తెలిపారు.

మండపేట: మండపేట మండలంలో తాపేశ్వరం, వెలగతోడు, పాలతోడు ఇప్పనపాడు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ రత్నాలరావు తెలిపారు. విద్యుత్ మరమ్మతులు మెయింటెనెన్స్ నిమ్మిత్తం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలంలో 33/11 కేవీ ట్రీ కటింగ్ కోసం వానపల్లి, బిళ్లకుర్రు, పలివెల, కొత్తపాలెం, ఖండ్రీగ, అవిడిలో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ కె.రాంబాబు తెలిపారు.

నాగలక్ష్మి సేవలు ప్రశంసనీయం

ద్రాక్షారామ, జూలై17(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం మండలం కాపవరం ఉన్నత పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేసిన నందూరి నాగలక్ష్మీ సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. నందూరి నాగలక్ష్మీ వెంకటాయాపాలెం బదిలీపైవెళ్లిన గ్రామస్థులు నాగలక్ష్మీని ఘనంగా సత్కరించారు.

రైతుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

● ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ నరసింహారావు


డ్రైన్‌కు కొబ్బరికాయకొట్టి ప్రారంభిస్తున్న ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ నరసింహారావు

ఆత్రేయపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సత్వర చర్యలు చేపడుతున్నట్లు సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ కరుటూరి నరసింహారావు పేర్కొన్నారు. గురువారం లొల్ల కొత్త వంతెన వద్ద మెర్ల, ర్యాలి, లొల్ల గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. రూ.2.50కోట్లతో సైఫాన్ నిర్మాణం పూర్తిచేయడం జరిగిందన్నారు. రైతుల పంట పొలాలకు ముంపు సమస్య లేకుండా శాశత్వ పరిష్కారం చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఎన్నో ఏళ్లుగా పట్టి పీడిస్తున్న సమస్యను పరిష్కరించారన్నారు. సైఫాన్ నిర్మాణం ద్వారా ముంపు సమస్య పరిష్కారం కానుందన్నారు. ప్రస్తుతం సైఫాన్ నుంచి ముంపునీరు వెళ్లే మార్గం లేకపోవడంతో పంటపొలాలు ముంపుబారిన పడ్డాయి. ఈ నేపథ్యంలో ముంపు సమస్యను నివారించేందుకు నీటిని మళ్లించే చర్యలు చేపట్టారు. సైఫాన్ ద్వారా వచ్చే నీటిని ర్యాలి మేజర్ డ్రైన్‌లోకి మళ్లించే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డ్రైన్స్ ఏఈ విజయలక్ష్మి, నీటి సంఘం అధ్యక్షులు కె.పుత్రసాయిరాం, ఎం.రాము, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కూటమి ఏడాది పాలనలో ఎన్నో విజయాలు

ఆత్రేయపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలనలో ఎన్నో విజయాలు సాధించినట్లు టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కూనంపూడి రామకృష్ణంరాజు పేర్కొన్నారు. గురువారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా క్లస్టర్ ఇన్‌చార్జ్, సర్పంచ్ కాయల జగన్నాధం ఆధ్వర్యం లో నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి పాలనలో అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో చేపట్టనున్న సంక్షేమ పథకాలను ఇంటింటా వివరించారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కరపత్రాల రూపంలో అందించి యాప్‌లో పొందుపరిచారు. అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.4.13లక్షలు


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూలై17(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నో ము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,13,793లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.

వెంకన్నను దర్శించుకున్న రామచంద్రయ్య

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షు డు కోడే రామచంద్ర యాదవ్ స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. దేవస్థానం స్వామివారి చిత్రపటం అందజేశారు.

'కూటమి మోసపూరిత హామీలపై ప్రజలకు తెలపాలి'

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలపై వాస్తవాలను ప్రజలకు వార్డు స్థాయిలో తెలియజెప్పాలని ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ కోరారు. రామచంద్రపురం పట్టణ వైసీపీ కార్యాలయంలో గురువారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. పట్టణ వైసీపీ అధ్యక్షుడు గాదంశెట్టి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్ చార్జి పిల్లి సూర్యప్రకాష్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, నియోజకవర్గ పరిశీలకుడు కుడుపూడి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ మాట్లాడారు. వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వైసీపీ సమావేశం

మండపేట, జూలై17(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గస్థాయి వైసీపీ సమావేశం శుక్రవారం మండపేటలో నిర్వహిస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. మండపేటలో నిర్వహించే సమావేశానికి మాజీమంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డితోపాటు పలువురు నేతలు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. మండపేట పట్టణంలో బస్టాండ్‌వద్దవున్న సూర్య కన్వెన్షన్‌హాలులో జరిగే సమావేశానికి నియోజకవర్గం నుంచి వైసీపీ శ్రేణులు తరలిరావాలని ఎమ్మెల్సీ తోట పిలుపు నిచ్చారు.

తడి, పొడి చెత్త సేకరించాలి

ఆత్రేయపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుంచితడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని డివిజనల్ డవలప్‌మెంట్ అధికారి రాజేశ్వరరావు సూచించారు. గురువారం తాడిపూడిలో పారిశుధ్య చర్యలపై ఎంపీడీవో వెంకటరామన్‌తో కలిసి పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి చెత్త రిక్షా ప్రతిరోజు తిరిగి చెత్తను సేకరించాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. కార్యదర్శి కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన బూత్‌లెవెల్ ఎన్నికల శిక్షణా తరగతులు


అధికారుల శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కృష్ణమూర్తి

మండపేట, జూలై17 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న బూ త్‌లెవెల్ శిక్షణా తరగతులు గురువారంతో ము గిశాయి. మండపేట మండల పరిషత్ కార్యాలయంలో మండపేట రూరల్, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలకు సంబంధించి 42 మంది బూత్ లెవెల్ అధికారులకు నియోజకవర్గ ఓటరు నమోదు ప్రత్యేకాధికారి డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావుల నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులు అందరూ ఎన్నికలకు సంబంధించిన విధుల్లో అలసత్వం వహించకుండా ఉండాలని కోరారు. మండపేట మండల తహసీల్దార్ పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులు చట్టాలు ఎన్ని కల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వివిధ రాజకీయపార్టీలకు చెందిన నాయకులు మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులంతా ఈ శిక్షణను ఒక బాధ్యతగా భావించాలన్నారు. ఓటర్లజాబితాలో డబుల్ ఎంట్రీలను తొలగించాలని వారు కోరారు. ఈశిక్షణా కార్యక్రమంలో కోచ్ నాగం శివ, డీటీమోహర్‌బాబా, వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఉంగరాల రాంబాబు, ఎం.రవీంద్రరెడ్డి, పాలిక రమణ, పందిరి వీర్రాజు, నియోజకరవర్గపరిధిలోగల 42మంది బూత్‌లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

గోగులాంబ అమ్మవారికి ఆషాఢం సారె సమర్పణ


గోగులాంబ అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

ద్రాక్షారామ, జూలై17(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం ఓదూరు గ్రామంలో ఉన్న గోగులాంబ అమ్మవారికి గురువారం గ్రామస్థులు, భక్తులు ఆషాఢం సారె సమర్పించారు. గ్రామకూడలి నుంచి డప్పు వాయిద్యాలతో మహిళలు ఊరేగింపుగా గోగులాంబ అమ్మవారికి ఆలయానికి చేరుకున్నారు. పసుపు, కుంకుమ, చీర, సారె, స్వీట్లు, పండ్లు తీసుకుని ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండేపూడి జానకిరామయ్య, టీడీపీ నాయకులు కొండేపూడి సత్తిబాబు, సలాది కృష్ణ, వింజమళ్ల శ్రీనివాస్, బుంగ అప్పారావు, యనమదల పీఏసీసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మాదాల ఆనందరావు, సభ్యుడు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

శాకంబరిగా పెద్దింట్లమ్మ

రావులపాలెం, జూలై 17(ఆంధ్రజ్యోతి): రావులపాలెం కొత్తకాలనీలో ఉన్న పెద్దింట్లమ్మ అమ్మవారు శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అజయ్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


కొత్తకాలనీలో శాకంబరి అలంకరణలో పెద్దింట్లమ్మ అమ్మవారు

సీఎం చంద్రబాబుకు ఆర్యవైశ్యుల అభినందన


పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్యులు

మండపేట,జూలై 17(ఆంధ్రజ్యోతి) ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుడు పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టుకు అమరావతిలో 6.8 ఎకరాల స్థలం కేటాయించటంతోపాటు 58 అడుగుల విగ్రహం ఏర్పాటుకు సీఎం చంద్రబాబునాయుడు ఆమోదం తెలిపారు. మంపేట పట్టణానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు సీఎం చంద్రబాబు నాయుడుకు అభినం దనలు తెలిపారు. ఈమేరకు గురువారం మండపేట పట్టణ పెద్ద కాల్వవద్ద వున్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సీఎం చంద్ర బాబు చిత్రపటానికి ఆర్య వైశ్య ప్రముఖులు పాలాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాకచర్ల వెంకటసత్యనారాయణగుప్తా, ఉపాధ్యక్షుడు కంచర్ల ప్రసాద్, నాళం కిట్టు, కేశవరపు శ్రీను, కాళ్లకూరి శ్రీనువాస్, గాది శ్యామలరావు, పట్నాలసురేష్, బోనగిరి బాబ్జి, బలభద్రపు రాజు, కంచర్ల రాజు, వెత్సాసుబ్బారావు పాల్గొన్నారు.